RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | బుధవారం, జూన్ 17, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 56 | పేజీలు: 8 | వెల : రూ.1



వరంగల్‌కు పవన్

# సన్న వడ్ల రైతులకు సర్కార్ గుడ్‌న్యూస్

### వ్యవసాయ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు!



హైదరాబాద్, జూన్ 16 : తెలంగాణలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వ్యవసాయ శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సాంకేతికత వినియోగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో బోనస్ అందించే ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందించడంతో పాటు రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని ఆదేశించారు. సన్న వడ్లు పండించే రైతుల పూర్తి వివరాలను సేకరించాలని, ధాన్యం దిగుబడులపై వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని పేర్కొన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో అమలు చేస్తున్న పైలెట్ ప్రాజెక్టును మరింత విస్తరించాలని ముఖ్యమంత్రి సూచించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగాన్ని పెంచాలని, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×)ను వ్యవసాయ సేవల్లో ఉపయోగించాలని చెప్పారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని నోడల్ ఏజెన్సీగా నియమించి, విత్తనాల సరఫరా నుంచి ధాన్యం కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, ఆయిల్‌ఫెడ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేయాలని, యాప్ ద్వారా బుక్ చేసుకున్న యూరియాను రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్లకు యూరియా పంపిణీ బాధ్యతలు అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అదేవిధంగా ఎరువుల కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వానికి నిరంతరం లేఖలు రాయాలని, రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే ఎరువులను తెలంగాణకే కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం స్పష్టం చేశారు. ఈ అంశంపై అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించాలని కూడా సూచించారు




# బీఆర్ఎస్‌ను ట్రాక్‌లోకి తెచ్చేందుకు బస్సు యాత్ర

హైదరాబాద్, జూన్ 16 ( వాయిస్ టుడే ) : తెలంగాణ రాజకీయాల్లో భారత్ రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మళ్లీ యాక్టివ్ కాబోతున్నారనే వార్తలు గులాబీ శ్రేణుల్లో కొత్త జోష్ నింపుతున్నాయి. కేసీఆర్ త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టబోతున్నారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించడంతో పొలిటికల్ సర్కిల్స్‌లో సరికొత్త చర్చ మొదలైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, ఆ వెంటనే జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బస్సు యాత్ర చేసినప్పటికీ పార్టీ ఖాతాలో ఒక్క సీటు కూడా పడకుండా జీరో ఫలితం రావడం కేసీఆర్‌ను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఆ దెబ్బతో దాదాపు రెండేళ్లకు పైగా ఆయన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. కేవలం ఇటీవల జరిగిన పార్టీ ప్లీనరీ, అలాగే జగిత్యాల లాంటి రెండు బహిరంగ సభల్లో మాత్రమే ఆయన ప్రసంగించి వెళ్లారు తప్ప క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి రాలేదు.ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటిపోతున్న తరుణంలో.. కేసీఆర్ ఇప్పుడు బస్సు యాత్ర అస్త్రం చేతబట్టడం వెనుక కేవలం పార్టీ ఉనికిని చాటుకోవడమే కాకుండా, రాబోయే స్థానిక సంస్థలు లేదా సార్వత్రిక ఎన్నికల కోసం క్యాడర్‌ను సమాయత్తం చేయడమే ప్రధాన లక్ష్యంగా

(మిగతా 2వ పేజీలో)

# రూ.19 వేల కోట్ల రైతుబంధు బకాయిలు వెంటనే చెల్లించాలి: హరీశ్

### మానకొండూరులో కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు



కరీంనగర్, జూన్ 17 (వాయిస్ టుడే):లి కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గంలోని అల్గనూర్ గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి T. Harish Rao పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో మానకొండూరు కార్యకర్తలు విశేష పాత్ర పోషించారని, 2001లో పార్టీ ఆవిర్భావం నుంచే ఈ ప్రాంతం బీఆర్ఎస్‌కు బలమైన అండగా నిలిచిందన్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా బీఆర్ఎస్‌కు అంకితభావంతో పనిచేసే బలమైన కార్యకర్తల సైన్యం మానకొండూరులో ఉందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించిన ఆయన, కేసులు పెడితే పార్టీ బలహీనపడదని, ప్రజల్లో మరింత మద్దతు పెరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం “స్కీములు కాదు.. స్కాములే” నడుస్తున్నాయని ఆరోపించిన హరీశ్‌రావు, సివిల్ సప్లై, సింగరేణి, విద్యుత్, భూముల వ్యవహారాలతో పాటు గురుకులాల సరఫరాల్లో కూడా భారీ అవినీతి జరుగుతోందని విమర్శించారు. గురుకులాల్లో రూ.2,000 కోట్ల స్కామ్ జరిగిందని ఆరోపిస్తూ, సంబంధిత టెండర్లపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపించారు. ఉపాధి హామీ కూలీలకు “ఇందిరమ్మ ఆత్మీయ భరోసా” కింద ఏడాదికి రూ.12,000 ఇస్తామని ప్రకటించినా అమలు కాలేదన్నారు. అలాగే రూ.4,000 పెన్షన్, మహాలక్ష్మి పథకం కింద రూ.2,500 వంటి హామీలను కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని పేర్కొంటూ, ధాన్యం కొనుగోళ్లలో

(మిగతా 2వ పేజీలో)

# సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడుతాం: కల్వకుంట్ల కవిత

### శ్రీరాంపూర్ ఆర్కే-7 గనిని సందర్శించిన టీఆర్ఎస్ చీఫ్

మంచిర్యాల, జూన్ 17 (వాయిస్ టుడే):లి సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత శ్రీరాంపూర్ ఆర్కే-7 గనిని సందర్శించి కార్మికులతో సమావేశమయ్యారు. గనిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుని వారి పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కార్మికుల కనీస అవసరాలు కూడా తీర్చకుండా మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్మికులకు సరైన భద్రత, తాగునీరు, ఆధునిక సౌకర్యాలు కల్పించకపోవడం ఆందోళనకరమన్నారు. సింగరేణిలో మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వారికి తగిన సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందని విమర్శించారు. మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులకు సంబంధించిన పరికరాలు, యంత్రాల నిర్వహణకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, మరోవైపు కాంట్రాక్టర్లకు మాత్రం ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. గనుల్లో ఇప్పటికీ పాత సాంకేతికతనే ఉపయోగిస్తున్నారని, ఆధునిక టెక్నాలజీని అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో కార్మిక కుటుంబాలకు అన్యాయం జరుగుతోందని కవిత అన్నారు. మెడికల్ బోర్డు సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని

(మిగతా 2వ పేజీలో)



# ప్రభుత్వ విద్యకు కొత్త దిశ.. ఆరుట్లలో సీఎం డ్రీమ్ ప్రాజెక్ట్ ప్రారంభం

హైదరాబాద్, జూన్ 17 (వాయిస్‌టుడే): రాష్ట్రంలో ప్రభుత్వ విద్యకు కొత్త దిశను చూపే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్) ప్రాజెక్టుకు రేపు శ్రీకారం చుట్టనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకున్న ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను గురువారం ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఉదయం 9:30 గంటలకు ఆరుట్లకు చేరుకోనున్న ముఖ్యమంత్రి పాఠశాల పైలాన్‌ను ఆవిష్కరించనున్నారు. అనంతరం డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్స్, డైనింగ్ హాల్, క్రీడా మైదానాలను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ప్రభుత్వ విద్యను కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో దేశంలోనే ప్రత్యేకంగా విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసే చర్యలు చేపట్టింది. విద్యా కమిషన్ చైర్మన్ డాక్టర్ ఆకునూరి మురళి, సభ్యులు పీఎల్ విశ్వేశ్వర్ రావు, డాక్టర్ చారకొండ వెంకటేష్, జోష్నా శివారెడ్డి పర్యవేక్షణలో ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ రూపుదిద్దుకుంది. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందించనున్న

(మిగతా 2వ పేజీలో)



వాయిస్

బుధవారం, జూన్ 17, 2026

# నిరుద్యోగులపై లాఠీఛార్జ్ హేయమైన చర్య: కేటీఆర్

## 20 వేల కానిస్టేబుల్ పోస్టులతో మెగా నోటిఫికేషన్ విడుదల చేయాలి

## అరెస్టు చేసిన విద్యార్థులు, జేఏసీ నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్



హైదరాబాద్, జూన్ 17 (వాయిస్ టుడే):లి దిల్‌సుఖ్‌నగర్‌లో ఉద్యోగాల భర్తీ కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నిరుద్యోగ యువత, పోలీస్ అభ్యర్థులపై లాఠీఛార్జ్ జరగడం అత్యంత హేయమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఖ. ు. ఋఖ ఋశీ తీవ్రంగా ఖండించారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులను వీధుల్లో వెంటాడి లాఠీఛార్జ్ చేయడం, అక్రమంగా అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. విద్యార్థులను, నిరుద్యోగులను పోలీసులతో అణచివేయడమే కాంగ్రెస్ హామీ ఇచ్చిన "ఇందిరమ్మ ప్రజా పాలన"నా అని ప్రశ్నించారు. ఇప్పటికే హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగాల భర్తీ కోసం విద్యార్థులు, నిరుద్యోగులు నిరసనలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఏడాదిలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని, మెగా నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతను నిరాశపరిచిందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో 20 వేలకుపైగా పోలీస్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ కేవలం 5 వేల పోస్టులతో సరిపెట్టాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. కోచింగ్ సెంటర్లలో ఏళ్ల తరబడి శిక్షణ పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే 20 వేల కానిస్టేబుల్ పోస్టులతో మెగా నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దిల్‌సుఖ్‌నగర్‌లో ఆందోళన చేసిన నిరుద్యోగ జేఏసీ నేతలు, విద్యార్థులను పలు పోలీస్ స్టేషన్లకు తరలించి అరెస్టు చేయడాన్ని తప్పుబట్టిన కేటీఆర్, వారందరినీ బేషరతుగా తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను లాఠీలతో అణచివేయలేరని స్పష్టం చేసిన ఆయన, ప్రభుత్వం మొండివైఖరి వీడి 20 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీ, వయోపరిమితి సడలింపు వంటి డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. లేకపోతే నిరుద్యోగులు, విద్యార్థుల తరపున బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియపై కమిటీ సమావేశం

## అమరజ్యోతి కేంద్రంగా ఉద్యమకారులతో దశలవారీ సంప్రదింపులు



హైదరాబాద్, జూన్ 17: తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను సమగ్రంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. సమావేశానికి ముందు కమిటీ సభ్యులు తెలంగాణ అమరవీరుల స్మారకం అమరజ్యోతిని సందర్శించి అమరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం సలహాదారు, కమిటీ చైర్మన్ కే. కేశవరావు, రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, టీజేఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కే. కేశవరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వివిధ రూపాల్లో పోరాటం చేసిన ఉద్యమకారులు, విద్యార్థి నాయకులు, కళాకారులు, రచయితలు, న్యాయవాదులు, ప్రజా సంఘాల ప్రతినిధులు తదితర వర్గాలతో దశలవారీగా సంప్రదింపులు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 23వ తేదీ నుంచి అమరజ్యోతి కేంద్రంగా వివిధ వర్గాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించనున్నారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో కూడా సూచనలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములైన అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరిపి, ఉద్యమకారుల గుర్తింపునకు అవసరమైన మార్గదర్శకాలను రూపొందించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

# వరంగల్‌కు పవన్



వరంగల్, జూన్ 16 : పవన్ కళ్యాణ్ తెలంగాణ గడ్డపై అడుగుపెట్టబోతున్నారు. ఈ పర్యటనకు ఒక ప్రత్యేకమైన, భావోద్వేగ కారణం ఉంది. బుధవారం రోజు వరంగల్ హనుమకొండలో మృత్యువుతో పోరాడుతున్న తన వీరాభిమాని నిరంజన్ చివరి కోరిక మేరకు పవన్ కళ్యాణ్ అతని ఇంటికి వెళ్లను పవన్ కల్యామ్‌ను చూడాలనే తన చివరి కోరిక మేరకు అతని ఇంటికి వెళ్లనున్నారు. అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకోనున్నారు.హనుమకొండకు చెందిన నిరంజన్‌కు పదహారేళ్లు. చిన్నప్పుడు మామూలుగానే ఉండేవాడు. అయితే కానీ, 8 ఏళ్ల క్రితం అతడి జీవితం ఒక్కసారిగా మారిపోయింది. జన్యుపరమైన డీఎండీ వ్యాధి బారిన పడి పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు. ఎదుగుదల పూర్తిగా లోపించింది. కాస్త గట్టిగా పట్టుకుంటే భరించలేని నొప్పి . ఇటీవల టీవీలో సీఎం రేవంత్ ఫుట్‌బాల్ మ్యాచ్ చూసిన నిరంజన్.. ఆయన్ను, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలవాలనుందని తెలిపాడు. నిరంజన్ కోరికను జనసేన నేతలు, పవన్ అభిమానులు ఆయనకు వివరించారు. ఈ విజ్ఞప్తిని మన్నించిన పవన్ కల్యాణ్ రేపు హనుమకొండ వచ్చి నిరంజన్‌ను పరామర్శించనున్నారు. జనసేనాని టూర్ నేపథ్యంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అటు పోలీస్ శాఖ కూడా అప్రమత్తమైంది. పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోనుంది. గత కొన్ని రోజులుగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి, పవన్ కళ్యాణ్‌కు మధ్య తీవ్రమైన వాగ్వాదం నడుస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా జనసేన నిర్వహించ తలపెట్టిన తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ కు పోలీసులు, హైకోర్టు అనుమతి నిరాకరించడం వివాదానికి కేంద్ర బిందువైంది. దీనిపై జూబ్లీహిల్స్ నివాసంలో ప్రెస్ మీట్ పెట్టిన పవన్.. తెలంగాణ ఎవరి సొంత జాగీరు కాదు.. నన్ను హైదరాబాద్ రాకుండా ఆపేదెవరు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత ఢిల్లీ వేదికగా జరిగిన పార్టీ సేన ప్రస్థానం' సమావేశంలోనూ.. తెలంగాణ అమరవీరులను గుర్తించడానికి ఈ పాలకులకు 12 ఏళ్లు సరిపోలేదా అంటూ కాంగ్రెస్ నాయకత్వంపై విరుచుకుపడ్డారు. పవన్ కళ్యాణ్ కేవలం అభిమాని నిరంజన్‌ను కలిసి వెళ్ళిపోయినా.. ప్రస్తుతమున్న పొలిటికల్ టెన్షన్స్ దృష్ట్యా దానికి రాజకీయ ప్రాధాన్యత లభించడం ఖాయం. ఢిల్లీ వేదికగా పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. రాష్ట్ర విభజన సరిగ్గా జరగలేదని పవన్ మాట్లాడటాన్ని, తెలంగాణ సెంటిమెంట్‌ను తక్కువ చేసి చూపడంగా కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణలో తిరగడాన్ని తాము అడ్డుకుంటామని ఇప్పటికే కొంతమంది ద్వితీయ శ్రేణి కాంగ్రెస్ నాయకులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి పవన్ పర్యటించే నియోజకవర్గం లేదా రూట్ మ్యాప్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు నిరసనలు తెలిపే లేదా అడ్డుకునే ప్రయత్నాలుఉన్నాయని భావిస్తున్నారు.ఈ పర్యటన కేవలం ఒక అభిమానిని కలవడం కోసమే కాబట్టి ఎలాంటి రాజకీయ ప్రసంగాలు ఉండకపోవచ్చని జనసేన వర్గాలు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఏపీ డిప్యూటీ సీఎం హోదాలో పవన్ వస్తుండటంతో తెలంగాణ ప్రభుత్వం ప్రోటోకాల్ ప్రకారం భద్రత కల్పించాల్సి ఉంటుంది.

# గ్రామీణ ఆరోగ్యానికి భరోసా ఆర్ఎంపీ, పీఎంపీలే: కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్ : ఏళ్ల పాలన నేపథ్యంలో మానకొండూరులో ఆర్ఎంపీ, పీఎంపీలతో కేంద్ర మంత్రి 'చాయ్ పే చర్చ' తమపై దాడులను అరికట్టాలని కేంద్ర మంత్రికి ఆర్ఎంపీల వినతి. సంఘ భవనానికి ఆర్థిక సాయం అందించాలని విజప్తి తెలంగాణ మెడికల్ కౌన్సిల్ మాపై దాడులు చేస్తున్నారు మమ్మల్ని ఇబ్బందులు పెడుతున్నారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఆర్ఎంపీ, పీఎంపీలేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్ఎంపీ, పీఎంపీలు లేని గ్రామీణ సమాజాన్ని ఊహించుకోలేమని చెప్పారు. అలాంటి వారిపై దాడులు చేయడం సరికాదని, ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరారు. గ్రామీణ వైద్యులు సేవలు నిలిపేస్తే ఆరోగ్య వ్యవస్థ స్థంభించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రధాని నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్. మానకొండూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆర్ఎంపీ, పీఎంపీలతో "చాయ్ పే చర్చ" కార్యక్రమాన్ని నిర్వహించారు. మోదీ 12 ఏళ్ల పాలనలో సాధించిన విజయాలను, ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సమాజంలో అట్టడుగునున్న చిట్ట చివరి వ్యక్తికి సైతం సంక్షేమ ఫలాలు అందించడమే బీజేపీ సిద్ధాంతమని, తూ.చ తప్పకుండా అమలు చేస్తున్న మహనీయుడు మోదీ అని కొనియాడారు. మోదీ పాలనా విజయాలను వివరించడంతోపాటు ప్రజలకు మరింత మేలు చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవసరమైన సలహాలు సూచనలు తీసుకునేందుకు "చాయ్ పే చర్చ" వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్లు ఫీల్డులో తమకు ఎదురవుతున్న సమస్యలను ఏకరవు పెట్టారు. కొంత మంది కావాలని తమపై అకారణంగా దాడులు చేస్తున్నారని వాపోయారు. తమపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. మానకొండూరు నియోజకవర్గంలో ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్ల అసోసియేషన్ సంఘ భవనం లేదని, నూతన భవన నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని విజఝప్తి చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ. ఆర్ఎంపీలపై దాడులను ఖండించారు. ఆర్ఎంపీ, పీఎంపీలతో సమాజానికి మంచి జరుగుతోందే తప్ప నష్టం జరగడం లేదు. తక్కువ ఖర్చుతో కుటుంబ సభ్యుల్లా మెలుగుతూ వైద్య సేవ అందిస్తున్నది ఆర్ఎంపీలే. ఆర్ఎంపీలు లేని సమాజాన్ని ప్రజలు ఊహించుకోలేరు. అలాంటి వారిపై దాడులు చేయడం సమర్ధనీయం కాదు. ఆర్ఎంపీలు 10 రోజులు తమ సేవలను నిలిపివేస్తే గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ పూర్తిగా స్థంభించిపోవడం ఖాయం. గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నది ఆర్ఎంపీలే. అని చెప్పారు. మోదీ పనితీరు గురించి మాట్లాడుతూ.మోదీ విజన్ ఉన్న నేత.10 ఏళ్ల ముందు ఈ దేశం ఎలా ఉంటుందో ఆలోచించి అందుకు అనుగుణంగా కార్యక్రమాలు చేపడతారు. డిజిటల్ విప్లవం అందులో భాగమే. 10 ఏళ్ల ముందు జన్ ధన్ ఖాతాలను ఓపెన్ చేసి డిజిటల్ లావా దేవీలను ప్రారంభిస్తే అందరూ హేళన చేశారు. ఇయాళ ఏమైంది? రోడ్డుపై చాయ్ అమ్ముకునే వ్యాపారాలు కూడా ఫోన్ పే, గూగుల్ పే ద్వారా లావా దేవీలు జరుపుతున్నారు. ఒక్క రూపాయి అవినీతికి తావు లేకుండా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదును దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్దిదారుడి ఖాతాలోనే పడుతోంది. అని చెప్పారు.




# బీఆర్ఎస్‌ను ట్రాక్‌లోకి తెచ్చేందుకు బస్సు యాత్ర

కనిపిస్తోంది. అయితే, రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. కేసీఆర్ ఈ యాత్ర పూర్తి చేసిన తర్వాత మళ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేంతవరకు ప్రజల్లోకి వచ్చే అవకాశాలు తక్కువే. అంతేకాదు, ఆయన ఇకపై అసెంబ్లీ సమావేశాలకు కూడా వచ్చే మూడ్‌లో లేరని స్పష్టమవుతోంది. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టే పూర్తి భారాన్ని ఆయన కేటీఆర్, తన్నీరు హరీష్ రావుల భుజాలపైనే పెట్టేశారు. అసెంబ్లీ వేదికగా గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై, అలాగే ప్రస్తుత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సవాల్ విసిరినా కేసీఆర్ సైలెంట్‌గా ఉండటం వెనుక పెద్ద వ్యూహమే ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్యం వేస్తున్న పొలిటికల్ సవాళ్లకు సమాధానం ఇచ్చేందుకు కేసీఆర్ ఏమాత్రం ఆసక్తి చూపించడం లేదు. తన స్థాయికి రేవంత్ రెడ్డి సరిపోరు, జూనియర్ నేతతో తాను నేరుగా తలపడటం వల్ల ఆయనకే ఎక్కువ పొలిటికల్ మైలేజ్ లభిస్తుంది అనే భావనలో కేసీఆర్ ఉన్నట్లు ప్యానల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. అందుకే, రేవంత్ రెడ్డిని ఢీకొట్టే బాధ్యతలను కేటీఆర్, హరీష్ రావులకు వదిలేసి.. తాను మాత్రం కేవలం ప్రజాక్షేత్రం లోనే తేల్చుకోవాలనే పంథాను ఎంచుకున్నారు.ఇక్కడ అసలైన ప్రశ్న ఏమిటంటే.. గతంలో ఫ్లాప్ అయిన బస్సు యాత్ర ఫార్ములాతో కేసీఆర్ మళ్లీ ప్రజలను ఆకట్టుకోగలరా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నే. అసెంబ్లీ ఓటమి తర్వాత బీఆర్ఎస్ ఓటు బ్యాంకు దారుణంగా చెల్లాచెదురైంది. అటు బీజేపీలోకి, ఇటు కాంగ్రెస్‌లోకి కీలక నేతలు, కేడర్ వలస వెళ్లడంతో గులాబీ కోట బలహీనపడింది. ప్రస్తుతం కాంగ్రెస్ హామీల అమలులో జరుగుతున్న జాప్యం, ప్రజల్లో కనిపిస్తున్న చిన్నపాటి అసంతృప్తిని క్యాష్ చేసుకోవడానికి కేసీఆర్ వాగ్ధాటి ఉపయోగపడుతుందని భావిస్తున్నప్పటికీ.. జనం గతాన్ని అంత సులభంగా మర్చిపోతారా అనేది అనుమానమేకేసీఆర్ బస్సు యాత్ర కేవలం ఒక ప్రచార పర్వం మాత్రమే కాదు, అది బీఆర్ఎస్ పార్టీకి జీవన్మరణ సమస్య. కేటీఆర్, హరీష్ రావు ఎంతగా కష్టపడుతున్నా.. పార్టీని నడిపించే కరిష్మా కేవలం కేసీఆర్‌కు మాత్రమే ఉంది. ఈ యాత్ర ద్వారా ఆయన తన పాత ఓటు బ్యాంకును తిరిగి రాబట్టుకోగలిగితే తెలంగాణలో మళ్లీ ముక్కోణపు పోటీ వస్తుంది; లేదంటే తెలంగాణ రాజకీయం కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మారిపోయి బీఆర్ఎస్ మరింత మూలనపడే ప్రమాదం ఉంది. అందుకే కేసీఆర్ సీరియస్‌గా ఈ యాత్ర చేసే అవకాశాలు ఉన్నాయి.

## రూ.19 వేల కోట్ల రైతుబంధు బకాయిలు వెంటనే చెల్లించాలి: హరీశ్

జాప్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుబంధు బకాయిలుగా మొత్తం రూ.19 వేల కోట్లు రైతులకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని ఆరోపిస్తూ, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు బీమా అమలు నిలిచిపోయిందని, బోనస్ చెల్లింపులు కూడా జరగలేదని ఆరోపించారు. 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా స్థానంలో పరిమిత విద్యుత్ అందించే విధానాలు తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో సుమారు 30 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని హరీశ్‌రావు అన్నారు. ఫీజులు రాకపోవడంతో డిగ్రీ, పీజీ పూర్తిచేసిన విద్యార్థులకు కూడా కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కరోనా, నోట్ల రద్దు వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం 9 సంవత్సరాల్లో రూ.19,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసిందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడుతాం: కల్వకుంట్ల కవిత

కోరారు. ఇటీవల కొందరికే నియామక పత్రాలు అందించగా వేలాది మంది ఇంకా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి సింగరేణికి మరిన్ని బొగ్గు బ్లాకులు కేటాయించేలా కృషి చేయాలని కోరారు. గోదావరి వ్యాలీలోని బొగ్గు వనరులు సింగరేణికే కేటాయించాలని, ప్రైవేట్ సంస్థలతో పోటీ పడాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని సూచించారు. అండర్‌గ్రౌండ్ మైనింగ్‌ను విస్తరించడం ద్వారా లక్ష మందికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని పేర్కొన్నారు. సింగరేణి లాభాల్లో కార్మికులకు రావాల్సిన వాటా విషయంలో కూడా అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం హెచ్‌ఎంఎస్‌తో కలిసి టీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని కవిత స్పష్టం చేశారు. కార్మికులను వేధించే అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యకు కొత్త దిశ.. ఆరుట్లలో సీఎం డ్రీమ్ ప్రాజెక్ట్ ప్రారంభం

ఈ పాఠశాలలో విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాసానికి సమాన ప్రాధాన్యం కల్పిస్తున్నారు. విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించనున్నారు. ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధనతో పాటు ఆధునిక సాంకేతిక సదుపాయాలు కల్పించారు. పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రభుత్వం నాలుగు పాఠశాలలను ఎంపిక చేసింది. రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్ల, మంచాల, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వంగూరు, పోల్కంపల్లి పాఠశాలలను మొదటి విడతలో ఎంపిక చేసింది. భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా 100 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ఆరుట్ల టీపీఎస్‌లో అత్యాధునిక వసతులు కల్పించారు. డిజిటల్ క్లాస్‌రూమ్స్, విశాలమైన ప్లేగ్రౌండ్స్, సైన్స్ ల్యాబ్స్, లైబ్రరీ, జిమ్, డైనింగ్ హాల్స్‌తో పాటు క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నిస్, క్యారమ్స్ వంటి క్రీడలకు ప్రత్యేక మైదానాలు ఏర్పాటు చేశారు. ఆయా క్రీడలకు ప్రత్యేక శిక్షకులను కూడా అందుబాటులో ఉంచారు. ఆరుట్ల పరిసర గ్రామాల విద్యార్థుల కోసం ఐదు స్కూల్ బస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో ఈ పాఠశాలలో ప్రవేశాల కోసం తల్లిదండ్రులు భారీగా ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో మొత్తం 1,814 మంది విద్యార్థులు చదువుతున్నారు. పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఇప్పటికే 'నో అడ్మిషన్' బోర్డు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ విద్యను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో ప్రారంభమవుతున్న ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ రాష్ట్ర విద్యా చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# బ్యాండ్, వాయిద్య కళాకారుల పెన్షన్‌పై సానుకూల నిర్ణయానికి కృషి

## సీఎం దృష్టికి తీసుకెళ్తాం: మంత్రి జూపల్లి

## బ్యాండ్ కళాకారుల ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి: బి వి కే ఎస్

సికింద్రాబాద్, జూన్ 16 (వాయిస్ టుడే ప్రతినిది): బ్యాండ్, వాయిద్య కళాకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. ఈ మేరకు బాగ్‌లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం బ్యాండ్ కళాకారులకు ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి, 1000/- కోట్ల నిధి కేటాయించాలని తెలంగాణ బ్యాండ్, వాయిద్య కళాకారులు రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై మాట్లాడుతూ.. అర్హులైన బ్యాండ్, వాయిద్య కళాకారులకు భాష సాంస్కృతిక శాఖ లో భాగంగా గుర్తిస్తూ.. గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు. బ్యాండ్ వాయిద్య కళాకారులకు పెన్షన్, ప్రత్యేకమైన సంక్షేమ బోర్డు అంశంపై సానుకూల నిర్ణయం తీసుకునేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తో చర్చించి శాసనసభలో నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమాజంలో అనాదిగా వస్తున్న కళలు,




కళాకారులను పరిరక్షించడం, ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో బ్యాండ్, వాయిద్య కళాకారులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. పండుగలు, జాతరలు, సామాజిక ఉద్యమాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో వాయిద్య కళాకారుల పాత్ర విశిష్టమైనదని అన్నారు. మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బ్రాండ్ వాయిద్య కళాకారులకు మద్దతిస్తూ మాట్లాడారు. కళాకారులు కోరేటివి స్వల్పమైన, న్యాయమైన డిమాండ్లని మా ప్రభుత్వం వస్తే ఈ డిమాండ్లను పరిష్కరిస్తామన్నారు. చెరుపల్లి సీతారామయ్య మాట్లాడుతూ వీరి డిమాండ్ లు న్యాయమైనవని, వీరు అడిగిన బడ్జెట్ను కేటాయిస్తే ప్రభుత్వానికి భారమేమి కాదని అన్నారు. సౌండ్ పొల్యూషన్ కంట్రోల్ కమిషన్ను ఏర్పాటు చేసి నియమాలు విధించాలన్నారు. రాష్ట్రంలో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు, సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు చేపట్టనున్న 'ప్రభాత భేరి' కార్యక్రమంలో బ్యాండ్, వాయిద్య కళాకారులను భాగస్వాములు కావాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కళాకారుల సహకారం అవసరమని చెప్పారు. బివికేఎస్ నాయకులు మాట్లాడుతూ ప్యాడ్ బ్యాండ్ వెహికల్స్ ని సీజ్ చేయరాదని, పోలీసుల వేధింపులు అరికట్టాలని కోరారు. హైదరాబాద్ లో కళాకారుల శిక్షణ కేంద్రాలకు స్థలాలు కేటాయించాలని, ప్రతి బ్యాండ్ యూనిట్కు పది లక్షలు వడ్డీ రహిత రుణం అందించాలని, 50 సంవత్సరాలు దాటిన కళాకారులకు నెలవారి పెన్షన్, ప్రమాదంలో మరణించిన కళాకారుల కుటుంబాలకు ఎక్స్గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్ పర్సన్ విమలక్క, పలు జిల్లాల నుంచి వచ్చిన బ్యాండ్, వాయిద్య కళాకారులు, సంఘాల ప్రతినిధులు, సాంస్కృతిక రంగ ప్రముఖులు పాల్గొన్నారు.



## జాతీయ సిగ్నల్ & టెలికమ్యూనికేషన్ అవార్డు దక్కించుకున్న దక్షిణ మధ్య రైల్వే

సికింద్రాబాద్, జూన్ 16 (వాయిస్ టుడే ప్రతినిధి): దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) ప్రతిష్ఠాత్మక జాతీయ సిగ్నల్ ఽ టెలికమ్యూనికేషన్ అవార్డు--2026ను అందుకుంది. రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఐఆర్ఎస్ఈ, ఐఆర్ఎస్టీఈ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు--2026లో ఈ అవార్డును ప్రదానం చేశారు. కవచ్ 4.0 అమలు, డిజిటల్ ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థల విస్తరణ, సిగ్నలింగ్ రంగంలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు దేశంలోనే ఉత్తమ జోన్ రైల్వేగా ఎస్‌సీఆర్‌ను ఎంపిక చేశారు. 2025-26లో దక్షిణ మధ్య రైల్వే 21 డిజిటల్ ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలను ప్రారంభించడంతో పాటు 486 రూట్ కిలోమీటర్ల మేర కవచ్ 4.0, 479 రూట్ కిలోమీటర్ల మేర ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్‌ను అమలు చేసింది. ఈ సందర్భంగా సికింద్రాబాద్‌లో జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను కలిసిన సిగ్నల్ ఽ టెలికమ్యూనికేషన్ బృందాన్ని ఆయన అభినందిస్తూ, రైల్వే భద్రత, సామర్థ్యాన్ని పెంచడంలో ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థలు కీలకమని పేర్కొన్నారు.



## బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించండి

### మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్

సికింద్రాబాద్, జూన్ 16 (వాయిస్ టుడే ప్రతినిధి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఈవో గుత్తా మనోహర్రెడ్డితో పాటు అర్చకులు మంత్రులను కలిసి జాతర నిర్వహించే తేదీల గురించి వివరించారు. జూలై 19వ తేదీన ఘటాల ఊరేగింపు, ఆగస్టు 2వ తేదీన అమ్మవారి బోనాలు. 3వ తేదీన రంగం కార్యక్రమం ఉంటుందని మంత్రికి తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ సారి భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని ఏర్పాట్ల విషయంలో ఏ మాత్రం ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన ఆదేశించారు. బోనాల జాతరలో ఏర్పాట్ల విషయంలో ఎక్కడ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అన్ని శాఖల అధికారులను సమన్వం చేసికుంటూ ముందుకు వెళ్లాలని వారు సూచించారు.

## బేగంపేట్‌లో "అరైవ్ అలైవ్" ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం



సికింద్రాబాద్, జూన్ 16 (వాయిస్ టుడే ప్రతినిధి): రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ట్రాఫిక్-1 డీసీపీ కె. రాహుల్ రెడ్డి ల ఆదేశాల మేరకు ఎసిపి జి.శంకర్ రాజ్ ఆధ్వర్యంలో మంగళవారం బేగంపేట్ ప్రకాశ్‌నగర్‌లోని శాంసంగ్ డివిజనల్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ అధికారులు అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం వంటి ప్రమాదకర అలవాట్ల వల్ల కలిగే నష్టాలపై వివరించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ల వినియోగం, లేన్ క్రమశిక్షణ పాటించడం, ట్రాఫిక్ సిగ్నల్స్ ను తప్పనిసరిగా అనుసరించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పీఎస్ బేగంపేట్ ఇన్‌స్పెక్టర్ జి. జానకి రాములు, శాంసంగ్ డివిజన్ మేనేజర్ రామకృష్ణ, టాటా మోటార్స్ మేనేజర్ ఎం.డి. సాదిక్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై పాల్గొన్న వారు చురుకుగా చర్చించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## జామా ఉస్మానియాలో "బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్" పథకం

### ప్రారంభించిన మోతే శ్రీలత శోభన్ రెడ్డి...




సికింద్రాబాద్, జూన్ 16 (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంక్షేమం, పోషకాహార భద్రత లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న "బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్" పథకాన్ని ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని జామా ఉస్మానియా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మోతే శ్రీలత శోభన్ రెడ్డి విద్యార్థులకు అల్పాహారం, పాలు పంపిణీ చేసి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రమాణాల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. చిన్నారులు పోషకాహార లోపం లేకుండా ఆరోగ్యంగా విద్యను అభ్యసించేందుకు అల్పాహార పథకం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులే దేశ భవిష్యత్తని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు.

# ప్రాథమిక విద్యలో సవాళ్లను అధిగమించి సమాన విద్యా అవకాశాలు కల్పించాలి: ఏఎస్‌యూ

నాచారం (వాయిస్ టుడే): తెలంగాణలో ప్రాథమిక విద్యారంగం ఒకవైపు కొత్త సంస్కరణలతో ముందుకు సాగుతుండగా, మరోవైపు ఉపాధ్యాయుల కొరత, విద్యార్థుల నమోదు తగ్గుదల, మౌలిక సదుపాయాల సమస్యలు, ఆదివాసీ ప్రాంతాల్లో విద్యా అసమానతలు వంటి సవాళ్లను ఎదుర్కొంటోందని ఆదివాసీ విద్యార్థి సంఘం (ఏఎస్‌యూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ సాగబోయిన పాపారావు పేర్కొన్నారు.

2025-26 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం 210 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులను ప్రారంభించడం స్వాగతించదగ్గ చర్య అని ఆయన తెలిపారు. సమగ్ర శిక్ష కార్యక్రమం కింద డిజిటల్ విద్య, ఇంగ్లీష్ మీడియం, స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల విస్తరణతో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో కొంత మేర విశ్వాసం పెరిగిందన్నారు. అయితే రాష్ట్రంలో సుమారు 15 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటంతో అనేక ప్రాథమిక పాఠశాలలు ఒకే ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయని పేర్కొన్నారు. దాదాపు మూడు వేల పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతను ఎదుర్కొంటున్నాయని, కొన్ని పాఠశాలల్లో 15 నుంచి 30 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఒక్క ఉపాధ్యాయుడే బోధన బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. యూడైస్‌ఈ ప్లస్ నివేదిక ప్రకారం రాష్ట్రంలోని



ప్రతి ఆరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి కేవలం ఒకే తరగతి గదితో నడుస్తోందని, దీనివల్ల బహుళ తరగతుల విద్యార్థులకు ఒకే గదిలో బోధించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గుతూ ఉండటంతో కొన్ని పాఠశాలలు పూర్తిగా మూతపడిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అయితే ప్రభుత్వం మూతపడిన పాఠశాలల్లో 157 పాఠశాలలను తిరిగి ప్రారంభించడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు.

ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మన్ననూర్ తదితర ఆదివాసీ ప్రాంతాల్లో మాతృభాషలో బోధన పరిమితంగా ఉండటం, ఉపాధ్యాయుల ఖాళీలు అధికంగా ఉండటం, మారుమూల తండాలు, గూడెల్లో పాఠశాలలకు చేరుకోవడం కష్టసాధ్యంగా ఉండటం వల్ల డ్రాప్‌అవుట్ రేటు ఎక్కువగా కనిపిస్తోందని తెలిపారు. గోండి, కొయ, కొలాం వంటి స్థానిక భాషల్లో ప్రాథమిక విద్య అందించడం అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, ఆదివాసీ ప్రాంతాల్లో మాతృభాష ఆధారిత బహుభాషా విద్యను అమలు చేయాలని, ఒకే గది పాఠశాలల సమస్యను పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు డిజిటల్ సదుపాయాలు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాలని డాక్టర్ సాగబోయిన పాపారావు ప్రభుత్వాన్ని కోరారు.

ఆదివాసీ, గ్రామీణ ప్రాంతాల పిల్లలకు సమాన విద్యా అవకాశాలు కల్పించడం రాష్ట్ర విద్యా విధానంలో ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్ లైన్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ



హైదరాబాద్ , జూన్ 16: నేషనల్ అకాడమీ అఫ్ సైబర్ సెక్యూరిటీ దేశ, విదేశాలలో అత్యంత ప్రాధాన్యత కలిగినటువంటి సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్ లైన్ ట్రైనింగ్ కొరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆన్ లైన్ లో దరఖాస్తులు కోరబడుచున్నవి. ఇంటర్ పాస్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ డిప్లొమా అండ్ ఇంజనీరింగ్ చదువుతున్న, పూర్తి చేసిన విద్యార్థులు ఈ సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్ లైన్ ద్వారా ట్రైనింగ్ పొందేందుకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు అని నేషనల్ అకాడమీ అఫ్ సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ విమలా రెడ్డి తెలిపారు. కోర్సులు: సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్, డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్, పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్. మాస్టర్ ప్రోగ్రాం ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్. శిక్షణ కాలం 5 నుండి 10 నెలల వరకు, శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో సర్టిఫికెట్స్ ప్రధానం చేయబడును. సైబర్ సెక్యూరిటీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ, విదేశాలలో విస్తృత ఉపాధి అవకాశాలు గలవు. సైబర్ సెక్యూరిటీ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు సాఫ్ట్వేర్, ఐ.టి, బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్ కేర్, రిటైల్ , ఈ కామర్స్, ఎడ్యుకేషన్ రంగం లో సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, ఇన్ఫర్మేషన్ అనలిస్ట్, పెనిట్రేషన్ టెస్టర్, సెక్యూరిటీ ఆర్కిటెక్ట్, ఐటీ సెక్యూరిటీ ఇంజనీర్, సెక్యూరిటీ సిస్టమ్స్ అడ్మినిస్ట్రేటర్, ట్రైనర్ మొదలగు ఉద్యోగావకాశాలు గలవు. ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ సైట్ : www.nationalcyber-securityacademy.org ఫోన్ నెంబర్: 7893141797



## క్రమశిక్షణతో బ్రతికిన గొప్ప వ్యక్తి ఉల్పే కృష్ణ

### కురుమ సంఘం రాష్ట్ర ట్రస్ట్ బోర్డ్ సభ్యులు కొలుపుల నరసింహ

హైదరాబాద్, జూన్ 16: తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డు గ్రహీత దివంగత ఊల్పే కృష్ణ క్రమశిక్షణే ఊపిరిగా కష్టమే ఇష్టంగా నిరాడంబరతే ఆలంబనగా చెరగని చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ అందరి హృదయాలలో మంచి పేరు సంపాదించుకున్న కృష్ణ మీ జ్ఞాపకాలు మా అందరిలో మెదులుతూనే ఉంటున్నాయని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు కొలుపుల నరసింహ పేర్కొన్నారు. మంగళవారం జియాగూడ కురుమ బస్తి లో శ్రీ రంగనాథ స్వామి కల్చరల్ అసోసియేషన్ మైదానంలో ఉల్పె కృష్ణ ( డోలక్ కృష్ణ) ప్రథమ వర్ధంతి సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు కురుమ సంఘం రాష్ట్ర నాయకులు కొలుపుల నరసింహ, నర్సా వినోద్ కుమార్, ఉల్పె శ్రీనివాస్, రాకేష్, గోవింద్ రాజ్, జ్యోతి అమర్ బాబు, ఉల్పే శ్రీనివాస్, ఉల్పే శ్రీధర్ లు ముఖ్య అతిథులుగా హాజరై కృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు, ఈ సందర్భంగా కొలుపుల నరసింహ, శ్రీనివాస్ లు మాట్లాడుతూ.. కృష్ణ కురుమ సంఘం అభివృద్ధితోపాటు, ఆధ్యాత్మిక భజనలు నిర్వహిస్తూ, ప్రజల్లో భక్తి ఆధ్యాత్మిక చింతనను ఎంతో పెంపొందించేందుకు కృషి చేసిన గొప్ప వ్యక్తి కృష్ణ అని వారు కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలోని పాతబస్తీలో, డోలక్ కళాకారులకు, భజన కళాకారులకు, ఎంతో పేరు తెచ్చి తీసుకువచ్చేందుకు కృష్ణ అహర్నిశలు పాటుపడ్డాడని వారు సందర్భంగా గుర్తు చేశారు, ఈ సందర్భంగా, జంట నగరాలకు చెందిన, 10,భజన మండలి నిర్వాహకులు, శ్రీనివాస్, ప్రతాప్ సింగ్, ఆంజనేయులు, లక్ష్మణ్, పాన్ మండి కృష్ణ,, కే శ్రీనివాసులు తమ భజన మండలి, పలు భక్తి ఆధ్యాత్మిక గీతాలను, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలపించి, ఆహుతులను అమితంగా ఆకట్టుకున్నారు, ఈ కార్యక్రమంలో, కృష్ణ సతీమణి, ఉల్పె లలిత, గుజ్జ సంగీత, గుజ్జ వెంకటేష్, బాలం కిరణ్ జ్యోతి, బాలం సంతోష్, అఖిల్, నిఖిల్, సాయి, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా ప్రభుత్వ సలహాదారులు వి. హనుమంతరావు జన్మదిన వేడుకలు

### కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్

అంబర్ పేట, జూన్ 16: సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు వి. హనుమంతరావు జన్మదిన వేడుకలు మంగళవారం బాగ్ అంబర్‌పేట్ లోని ఆయన నివాసంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్, ఆయన అభిమానులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, అభిమానుల సమక్షంలో వి. హనుమంతరావు భారీ కేక్‌ను కట్ చేశారు .ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు మోతే రోహిత్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆర్ . లక్ష్మణ్ యాదవ్ , మాజీ కార్పొరేటర్ పుల్ల నారాయణస్వామి, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణ గౌడ్, అవినాష్ , దిలీప్ కుమార్ నేత, గడ్డం లక్ష్మణ్ గౌడ్ , గడ్డం శ్రీధర్ గౌడ్, లక్ష్మణ్ , శ్రీకాంత్ నేత తదితరులు పాల్గొని పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. విహెచ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిరుపేదలకు అన్నదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వి. హనుమంత రావు మాట్లాడుతూ తనపై ఎల్లప్పుడూ ప్రేమాభిమానాలు చూపిస్తున్న కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . బలహీన వర్గాల సంక్షేమం కోసం తన వంతు కృషిని నిరంతరం కొనసాగిస్తానన్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
బుధవారం 17 జూన్ 2026



## ఆగస్టు 2న ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు ఆహ్వానం

సికింద్రాబాద్, జూన్ 16 (వాయిస్ టుడే ప్రతినిధి): సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆషాఢమాస బోనాల ఉత్సవాలను ఆగస్టు 2న నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆలయ ఈవో మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పండితులు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ను వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. అనంతరం ఉత్సవాల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఈ ఏడాది బోనాల ఉత్సవాల షెడ్యూల్‌ను ఎమ్మెల్యేకు అందజేశారు. జూలై 19న ఘటాల ఊరేగింపు ప్రారంభం కానుండగా, ఆగస్టు 2న అమ్మవారికి బోనాల సమర్పణ, ఆగస్టు 3న రంగం (భవిష్యవాణి) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వివరించారు.

## జనగామ డిఈఓ చేసిన అక్రమ బదిలీలను నిలిపివేయాలి

### టిఎస్ యుటిఎఫ్...

### ఎస్పీడి, డియస్ఈ లకు టిఎస్ యుటిఎఫ్ వినతిపత్రం...

సికింద్రాబాద్, జూన్ 16 (వాయిస్ టుడే ప్రతినిది): నిబంధనలకు విరుద్ధంగా జనగామ జిల్లా విద్యాశాఖ అధికారి నిర్వహించిన కెజిబివి ప్రత్యేక అధికారుల అక్రమ బదిలీలను రద్దు చేయాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ వెంకట్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల కాంట్రాక్టు సిబ్బంది సర్వీసులను ఏప్రిల్ నుండి రెన్యువల్ చేయకుండా, రెన్యువల్ చేయాలంటే బదిలీకి ఆప్షన్ పెట్టాలని ఎస్ ఒ లనుండి బలవంతంగా ఆప్షన్లు తీసుకుని ఈరోజు బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. పిజి సిఆర్టీలు, సిఆర్టీల బదిలీలకు రంగం సిద్ధం చేస్తున్నారు. వారికి ఇప్పటికే వ్రాత పరీక్ష కూడా నిర్వహించారు. ఏ జిల్లాలో లేని సాంప్రదాయం జనగామ జిల్లాలో అమలు చేయడం పట్ల సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కెజిబివి సిబ్బంది బదిలీలకు, రెన్యువల్ కు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాల్సివుంటుంది కానీ జిల్లా స్థాయిలో బదిలీలు చేసే అధికారం లేదు. లోగడ కొన్ని జిల్లాల్లో కలెక్టర్లు, డిఈఓలు పైరవీలకు పెద్దపీట వేసి బదిలీలు చేసిన సందర్భంలో ఎస్పీడి జోక్యం చేసుకుని రద్దు చేశారు. జనగామలో జరిగిన అక్రమ బదిలీలను రద్దు చేసి సిబ్బంది సర్వీసును రెన్యువల్ చేయాలని కోరుతూ ఎస్పీడి, డియస్ఈ కి టిఎస్ యుటిఎఫ్ పక్షాన వినతిపత్రాన్ని అందజేశారు.



## ఎస్ఐఆర్, సభ్యత్వ నమోదు ప్రక్రియలో భాగంగా బీఎల్ఏల నియామకం

హైదరాబాద్ : జూన్ 16(వాయిస్ టుడే): తెలంగాణ లో రానున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) మరియు సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సంబంధించి, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) నియామకం చేపట్టారు. ఈ నేపథ్యంలో గోషామహల్ నియోజకవర్గంలోని జాంబాగ్ డివిజన్‌కు బీఎల్ఏగా, అలాగే సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఇన్‌చార్జిగా నియమితులైన నాగేందర్ గౌడ్‌కు సంబంధించిన పత్రాలను ఈరోజు కోటిలోని పార్టీ ముఖ్య కార్యాలయంలో గోషామహల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్వీ మహేందర్ కుమార్ ఆధ్వర్యంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం. అనీల్, పి. నరేందర్ యాదవ్, శేఖర్, రాము, పున్నం శంకర్, రవీందర్ రెడ్డి, సుధాకర్, ధన్‌రాజ్, వి. సురేష్ పాల్గొన్నారు.

## ఎలక్ట్రిక్ వాహనాల గోదాములో మంటలు



మూసాపేట: మూతపడి ఉన్న గోదాములో భారీ అగ్నిప్రమాదం జరిగింది. అందులో నిల్వ ఉంచిన పాత ద్విచక్ర వాహనాలు బుగ్గిపాలైన ఘటన మూసాపేట పరిధిలో మంగ ళవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, అధి కారులు తెలిపిన ప్రకారం.. గూడ్స్‌షెడ్ రోడ్డులోని వడ్డెరబస్తీని ఆనుకుని ఉన్న గోదాములో 'పిక్యూ' పేరుతో వినియోగంలోలేని ఎలక్ట్రిక్ బైక్‌లను నిల్వ ఉంచారు. ఈ గోదామును 7 నెలలుగా తెరవడం లేదు. కాగా మధ్యాహ్నం గోదాము నుంచి మంటలు ఎగసి పడటం, దట్టమైన పొగలు రావడాన్ని స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ద్విచక్ర వాహనాలకున్న బ్యాటరీలు వరుసగా పేలుతుండటంతో శబ్దాలు రాగా పరిసర వాసులు భయాందోళనకు గురయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక శకటాలు మంటలను ఆర్పేశాయి. అప్పటికే దాదాపు 50వరకు వాహనాలు బుగ్గిపాలయ్యాయి. ప్రమాదం జరిగినా గోదాము యజమాని, నిర్వాహకులు ఎవరు అందుబాటులో లేరు.

# గృహ కార్మికులకు సమగ్ర చట్టం తేవాలి

### ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి

### టీడీడబ్ల్యుయు, సిఎఫ్టియుఐ నాయకులు




సికింద్రాబాద్, జూన్ 16 (వాయిస్ టుడే ప్రతినిది): సామాజిక రక్షణ, కార్మిక హక్కులను పరిరక్షించడానికి, రాష్ట్రంలో గృహ కార్మికుల కోసం ప్రత్యేక సమగ్ర చట్టం రూపొందించాలని, కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని తెలంగాణ డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్, అనన్ జోసెఫ్, సిఎఫ్టియుఐ వైస్ ప్రెసిడెంట్ లిస్సి జోసెఫ్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్, ఇందిరాపార్క్, ధర్నా చౌక్ వద్ద తెలంగాణ డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో ఇంటర్నేషనల్ డొమెస్టిక్ వర్కర్స్ డే సందర్భంగా గృహ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, మాధవరం కృష్ణారావు, పి ఓ డబ్ల్యు నాయకురాలు సంధ్య, జర్నలిస్ట్ సజయ, సోషల్ యాక్టివిటీస్ రవి, నీల వెంకటేష్ పలువురు నాయకులు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టి డి డబ్ల్యూ యు ప్రెసిడెంట్ అనన్ జోసెఫ్, సి ఎఫ్ టి యు ఐ వైస్ ప్రెసిడెంట్ లిస్సి జోసెఫ్ లు మాట్లాడుతూ లేబర్ కోడ్ ల ద్వారా కార్మిక చట్టాలలో ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పులు గృహ కార్మికులకు ఎటువంటి ఓదార్పును తీసుకురాలేదన్నారు. దీనికి అదనంగా వారు ప్రత్యేకంగా ఆరోగ్య, భద్రతా కోడ్ నుండి మినహాయించబడ్డారన్నార అసంఘటిత రంగానికి సంబంధించిన సంక్షేమ బోర్డులో అసంఘటిత కార్మికులందరూ నమోదుచేసుకోవాలని ఆదేశాలు ఉన్నప్పటికీ గృహ కార్మికులను బోర్డులో నమోదు చేయడానికి ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి చురుకైన చర్యలు తీసుకోలేదన్నారు. అంతేకాకుండా ఈ- శ్రమ్ రిజిస్ట్రేషన్ సామాజిక రక్షణ కోసం గృహ కార్మికులు చేసిన డిమాండ్లను నెరవేర్చలేదన్నారు. వారికి ఎలాంటి సంక్షేమం అందించబడుతుందో, ఎక్కడినుండి ఆర్థిక కేటాయింపులు జరుగుతున్నాయో అనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదని తెలిపారు. పని ప్రదేశం బహుళ గృహాలలో ఉన్నందున ఒక శాతం ఇంటి పన్ను నుండి కార్మికుల వాటాను ప్రభుత్వం ద్వారానే ఈఎస్ఐ బోర్డు కు చెల్లించి గృహ కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. అదేవిధంగా సొంత ఇల్లు లేని వారికి డబుల్ బెడ్ రూమ్ గృహాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గృహ కార్మికుల ఈఎస్ఐ కార్డుఅందజేయవలసిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. గృహ కార్మికుల సమస్యలపై తమ పార్టీ తరపున అసెంబ్లీలో లేవనెత్తుతామని తెలిపారు. సమస్యలు పరిష్కరించే వరకు తన పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమన్ వేదిక అంబిక, సంఘమిత్ర మీరా,గృహ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## వైసిపి అరాచకానికి అమరుడైన అమర్నాథ్ గౌడ్

శ్రీకాళహస్తి, జూన్ 16(వాయిస్ టుడే): బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆత్మ బంధువులైన బిసి వర్గాలకు చెందిన వారిపై కక్ష పెంచుకున్న వైసిపి అరాచకానికి అమర్‌నాథ్ గౌడ్ అమరుడయ్యాడని శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నేతల అరాచకానికి అశువులు బాసిన అమర్నాథ్ గౌడ్ మూడవ వర్ధంతి సందర్భంగా ఈరోజు శ్రీకాళహస్తి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాలుడి చిత్రపటానికి ఘన నివాళి అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పసి పిల్లాడిని కూడా చూడకుండా పెట్రోల్ పోసి తగలబెట్టేసిన వైసీపీ దుర్మార్గానికి ఇది ప్రత్యక్ష నిదర్శనం. అమర్నాథ్ ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకున్నాను.వైసిపి సైకోల దాష్టీకానికి బలైన ఎంతోమంది అమరులలో అమర్‌నాథ్ గౌడ్ మరణం చాలా బాధాకరమైనది అని, వైసిపి నాయకులు తన అక్కను వేధింపులకు గురి చేయడాన్ని చూసి తట్టుకోలేక ప్రశ్నిస్తే, జూన్ 15, 2023 న బడికి వెళ్తున్న 15 సంవత్సరాల అమర్‌నాథ్ గౌడ్ ను దారుణంగా కొట్టి, కట్టేసి సజీవ దహనం చేసి చిన్నారి ప్రాణాలను చిన్న వయసులోనే చిదిమేశారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డా.జి.దశరథాచారి, యం.సుబ్బయ్య, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యం.రవి., రెడ్డివారి గురవారెడ్డి, కామేష్ యాదవ్, కొట్టే సాయి, విజయకుమార్, నాగరాజు నాయుడు, కృష్ణయాదవ్, మునిరాజా నాయుడు, సుబ్రహ్మణ్యం రెడ్డి, శ్రీమతి రేణుకా దేవి, బిజెపి నాయకులు చంద్రప్ప, డా.యం.ఉమేష్ రావు, వజ్రం కిషోర్, కె.వి.ప్రతాప్, బుజ్జి, జయప్రకాష్, కోట చంద్రశేఖర్, మునిరాజా యాదవ్, బీమాల భాస్కర్, చిల్లకూరు మణి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను

### : ఎమ్మెల్యే బొజ్జల



శ్రీకాళహస్తి జూన్ 16 (వాయిస్ టుడే): రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజం. కానీ, ఒక బాధ్యతాయుతమైన హోంమంత్రి పదవిలో ఉన్న దళిత మహిళను, ఆమె పనితీరుపై కాకుండా ఆమె మేకప్‌ను లక్ష్యంగా చేసుకుని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. దళిత మహిళ ఆత్మవిశ్వాసంతో హుందాగా కనిపిస్తే వైసీపీ నేతలకు ఎందుకు అంత అసహనం ఇదేనా మీ సామాజిక న్యాయం నాడు ఐటీ శాఖ మంత్రిగా ఉండి రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ తేలేక, ఐటీ అంటే ఏంటో కూడా తెలియక ఏమీ చేతకాని దద్దమ్మలా మిగిలిపోయిన అమర్నాథ్ ఈరోజు ఒక మహిళా ప్రజాప్రతినిధి రూపురేఖలపై మాట్లాడటం అతని వంకర బుద్ధికి, రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం. నాడు చంద్రబాబు నాయుడు కుటుంబంలోని మహిళలను అసెంబ్లీలో అవమానించినప్పుడే వైసీపీ సంస్కృతి ఏంటో రాష్ట్ర ప్రజలందరికీ అర్థమైంది.కూటమి ప్రభుత్వంలో చట్టం ఎవరికీ చుట్టం కాదు తప్పు చేస్తే సొంత పార్టీ వారినైనా ఉపేక్షించకుండా యాక్షన్ తీసుకునే దమ్మున్న నాయకత్వం మనది. తప్పు చేసిన కోనేటి ఆదిమూలంను తక్షణమే సస్పెండ్ చేశాం,జగన్ ఇంటి మహిళలపై పోస్ట్ పెట్టిన కిరణ్ కుమార్‌ను అరెస్ట్ చేయించాం మహిళల రక్షణ కోసం శక్తి యాప్ జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నాం. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. హోంమంత్రి అనితపై చేసిన వ్యాఖ్యలకు గుడివాడ అమర్నాథ్ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలి, మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే సహించే ప్రసక్తే లేదు ఈ కార్యక్రమంలో పాల్గొన్న కోలా ఆనంద్ కుమార్ కూటమి ప్రభుత్వం టిడిపి నాయకులు పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 'పోల్స్ అండ్ లైన్స్ స్పెషల్ డ్రైవ్'లో భాగంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించిన టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్

### విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం



హైదరాబాద్, జూన్ 16: రాష్ట్రవ్యాప్తంగా వర్షాకాల సన్నద్ధతలో భాగంగా నిర్వహిస్తున్న లి"పోల్స్ అండ్ లైన్స్ స్పెషల్ డ్రైవ్ -- వాక్ అలోంగ్ ది లైన్"లి కార్యక్రమంలో భాగంగా టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోని ఆనంద్‌నగర్ కాలనీలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమం రెండో రోజు ఉదయం 9:30 గంటల నుంచి 11 గంటల వరకు కొనసాగిన ఈ తనిఖీల్లో విద్యుత్ పంపిణీ వ్యవస్థను లైన్ టు లైన్ పరిశీలించిన సీఎండీ, విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, జంపర్లు, సర్వీస్ కనెక్షన్లు తదితర విద్యుత్ మౌలిక వసతుల స్థితిగతులను సమగ్రంగా సమీక్షించారు. తనిఖీల సందర్భంగా గుర్తించిన నెట్‌వర్క్ లోపాలు, పెండింగ్ మరమ్మతు పనులు, లైన్ క్లియరెన్స్ సమస్యలు, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు మరియు విద్యుత్ సరఫరా నాణ్యతపై ప్రభావం చూపే ఇతర అంశాలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ వినియోగదారులకు ఎప్పుడూ అందుబాటులో ఉండి వారి ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. అలాగే ఫీల్డ్ విధులు నిర్వహించే సమయంలో నిర్దేశిత యూనిఫాం, వ్యక్తిగత రక్షణ పరికరాలు (పీపీఈ), లైన్ టూల్స్ మరియు ఇతర భద్రతా పరికరాలను తప్పనిసరిగా వినియోగించాలని స్పష్టం చేశారు. వర్షాకాలంలో విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఎల్‌టీ, హెచ్‌టీ నెట్‌వర్క్‌ల నిర్వహణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ క్లియరెన్స్, నివారణ నిర్వహణ చర్యలను సమర్థవంతంగా అమలు చేసి నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తమ పరిధిలోని విద్యుత్ నెట్‌వర్క్‌లను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యలు తలెత్తక ముందే నివారణ చర్యలు చేపట్టాలని, తద్వారా వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందేలా చూడాలని జితేష్ వి. పాటిల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైఫాబాద్ ఆపరేషన్స్ డీఈ సమ్మయ్య, ఏడీఈలు దుర్గ శ్రీనివాస్, వినోద్ కుమార్, ఏఈ నరసింహాతో పాటు విద్యుత్ శాఖకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌కు బీజేపీ కిసాన్ మోర్చా వినతిపత్రం



ఖమ్మం : జూన్ 16.(వాయిస్ టుడే ): ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు అందించడంతో పాటు, నకిలీ విత్తనాల దందాను ఉక్కుపాదంతో అరికట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్‌కు భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకూరి రమేష్ తదితరులు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ విత్తనాల బెడదను ప్రభుత్వం వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా పూర్తిగా వ్యవసాయ ఆధారిత జిల్లా అని, ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా సుమారు 5.5 లక్షల నుంచి 6 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా జిల్లాలో అత్యధికంగా 2.5 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతోందని, ఇందుకు కనీసం 5 లక్షల నుంచి 6 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరం అవుతాయని వివరించారు. అలాగే 1.5 లక్షల నుంచి 2 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోందని, ఎకరాకు 25–30 కిలోల చొప్పున వేలాది క్వింటాళ్ల సన్న రకాల విత్తనాలు అవసరమని, రెండు లక్షల ఎకరాలకు పైగా మిర్చి, మొక్కజొన్న, అపరాలు సాగవుతున్నాయని తెలిపారు. ఈ భారీ విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద విత్తనాల కొరత లేకుండా సరిపడా నిల్వలు ఉంచాలని, ఏ ఒక్క రైతు విత్తనాల కోసం క్యూ లైన్లలో నిలబడే పరిస్థితి రాకూడదని విన్నవించారు. ప్రభుత్వం సొసైటీల ద్వారా అందిస్తున్న జీలుగు విత్తనాలు పూర్తిగా పుచ్చిపోయి ఉన్నాయని, వాటి మొలక శాతం కేవలం 25 శాతానికి మించి రావడం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.పచ్చిరొట్టెకు వాడే విత్తనాలను సైతం ప్రభుత్వం నాణ్యమైనవే ఇవ్వాలని కోరారు. ప్రైవేట్ డీలర్లు, విత్తన కంపెనీలు పత్తి, మిర్చి, వరి సాగు చేసే రైతులకు మాయమాటలు చెప్పి నకిలీ విత్తనాలు అంటగడుతున్నారన రైతులు పెట్టుబడి అంతా పెట్టి, తీరా దిగుబడి రాక అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా నకిలీ పత్తి, మిర్చి విత్తనాల ముఠాల వల్ల అమాయక రైతులు నిలువునా మోసపోతున్నారని, ఈ దందాను అరికట్టేందుకు వ్యవసాయ, పోలీసు శాఖల సమన్వయంతో 'స్పెషల్ టాస్క్ ఫోర్స్' బృందాలను ఏర్పాటు చేసి, నకిలీ విత్తనాలు విక్రయించే డీలర్లపై పీడీ యాక్ట్ (గ్రణ ~ాష్) కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం సమర్పించిన కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రుద్ర ప్రదీప్, పార్టీ సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు నరుకుల వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రవి రాథోడ్, నకరికంటి వీరభద్రం, మారుతి వీరభద్ర ప్రసాద్, పార్టీ కోశాధికారి గౌతమ్ లక్ష్మీనారాయణ, బోయినపల్లి శేఖర్, ఆర్ఎస్ యాదవ్, సిరిపురపు ప్రసాద్, నిమ్మటూరి రామారావులతో పాటు పలువురు బిజెపి కిసాన్ మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆదర్శ పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే

### రెండు రోజుల్లో నిధులిచ్చి సమస్యను పరిష్కరిస్తానన్న ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్16: నిర్మల్ జిల్లా కుంటాల మండలం లోని ఆదర్శ పాఠశాల ను లిఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్లి మంగళవారం పరిశీలించారు.పాఠశాల లో డ్రైనేజీ వ్యవస్థ విద్యుత్ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం తో పలు సమస్యలను పాఠశాల ప్రిన్సిపల్ రాజు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే స్వయానా గంట పాటు అవరణ అంతా తిరుగుతూ సమస్యలను తెలుసుకున్నారు. విద్యుత్ అధికారులను పిలిపించి సమస్య పరిష్కరించాలని సూచించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్య పరిష్కారానికి తన వంతుగా పాటుపడతానని అన్నారు. విద్యార్థులకు మరింత మెరుగైనా విద్యను అందించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధి కి 48 గంటల్లో నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. అనంతరం కుంటాల సర్పంచ్ గజేందర్, మాజీ ఎం. పి. పి. గజ్జరాం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కి నిధులు ఇస్తానన్న ఎమ్మెల్యే కు వారు కృతజ్ఞతలు చెప్పారు.

### దౌనెల్లిలో ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే

కుంటాల మండలం లోని దౌనెల్లి గ్రామం లో ఇందిరమ్మ ఇల్లును లిఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్లి ప్రారంభించారు.గ్రామం లోని షేక్ సుగురా భాను కు చెందిన ఇల్లు ప్రారంభోత్సవ కార్యక్రమం లో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ తో పాటు గ్రామస్తులు ఎమ్మెల్యే ను స్వాగతించి శాలువ తో సత్కరించారు. కార్యక్రమం లో సర్పంచ్ లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## స్పందన సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత బస్ పాసులు




నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్16: స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులకు 50% రాయితీతొ కూడిన బస్సు పాసులు ఉచితంగా అది అందజేస్తున్నామని నిర్మల్ జిల్లా అధ్యక్షులు ఇసాక్ అలీ మంగళవారం తెలిపారు. ఈ బస్సు పాసులు ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్, సెమీ ఢిలక్స్ లలో వర్తిస్తాయని, ఇందుకు ఆధార్, సదరం జిరాక్స్, ఒక ఫోటో కావాలని తెలిపారు. ఈ సదావకాశాన్ని నిర్మల్, ఖానాపూర్ నియోజకవర్గాల దివ్యాంగులు సద్వినియోగం చేసు కోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం నిర్మల్ కోర్టు దగ్గర గల స్పందన ఆన్లైన్ షాప్ లో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పందన దివ్యాంగుల సంక్షేమ జిల్లా అధ్యక్షులు ఇసాకు అలీ కోఆర్డినేటర్ షాక్ పెల్లి సురేందర్ పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి

### ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

### నిర్మల్ జిల్లా దిలావర్ పూర్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 16: దిలావార్ పూర్ మండలం ఒడ్డెపల్లి గ్రామంలో రూ. 10 లక్షలతో ప్రైమరీ స్కూల్ కాంపౌండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలోని లోలం గ్రామంలో రూ. 40 లక్షలతో ప్లాస్టిక్ వెస్ట్ మేనేజ్మెంట్ సిస్టం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దిలావార్ పూర్ మండల కేంద్రంలో రూ. 40 లక్షలతో నాలుగు స్ హ్ జి (వి ఓ) భవనాల నిర్మాణానికి, రూ. 40 లక్షలతో నాలుగు స్ హ్ జి (వి ఓ) వర్క్ షెడ్ ల నిర్మాణానికి, రూ. 36 లక్షలతో మూడు అంగన్వాడీ భవనాల నిర్మాణానికి, రూ. 20 లక్షలతో గ్రామ పంచాయితి భవన నిర్మాణానికి, రూ. 10 లక్షలతో ప్రైమరీ స్కూల్ కాంపౌండ్ నిర్మాణానికి , కేజీబీవీ అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్ లు, జిల్లా మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మామునూర్ మండల ఉద్యమానికి టీఆర్ఎస్ అండ

### రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపిన రాష్ట్ర నేత డా.లయన్ నడిపెల్లి వెంకటేశ్వరరావు

### "ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం వెంటనే గౌరవించాలి.. మామునూర్‌కు మండల హోదా కల్పించాలి"




హనుమకొండ, జూన్ 16: మామునూర్‌ను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలనే ప్రజల దశాబ్దాల ఆకాంక్షకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) బలమైన మద్దతు ప్రకటించింది. మండల సాధన కోసం కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు సంఘీభావంగా టీఆర్ఎస్ రాష్ట్ర నేత, వరంగల్–హనుమకొండ జిల్లాల ఇన్‌చార్జి డా. లయన్ నడిపెల్లి వెంకటేశ్వరరావు మంగళవారం దీక్షా శిబిరాన్ని సందర్శించి ఉద్యమకారులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ రాష్ట్ర నేత వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. మామునూర్ మండల ఏర్పాటు అనేది కేవలం పరిపాలనా అంశం మాత్రమే కాదని, వేలాది మంది ప్రజల అభివృద్ధి, సంక్షేమం, ప్రభుత్వ సేవల సులభ అందుబాటు, ప్రాంతీయ పురోగతికి సంబంధించిన కీలక అంశమని పేర్కొన్నారు. ప్రజల న్యాయబద్ధమైన డిమాండ్‌ను ప్రభుత్వం గౌరవించి వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మామునూర్ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా మండల హోదా కోసం పోరాటం చేస్తున్నప్పటికీ ఇప్పటికీ వారి ఆకాంక్ష నెరవేరకపోవడం బాధాకరమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పరిపాలనా వికేంద్రీకరణ, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలంటే మామునూర్‌ను ప్రత్యేక మండలంగా ప్రకటించడం అత్యవసరమని స్పష్టం చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు ప్రజలలో ఉన్న చైతన్యానికి, తమ హక్కుల సాధన కోసం వారు చేస్తున్న శాంతియుత పోరాటానికి నిదర్శనమని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ ఉద్యమం రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రయోజనాలను కేంద్రబిందువుగా చేసుకుని సాగుతోందని, అందుకే తెలంగాణ రక్షణ సేన పూర్తి మద్దతు ప్రకటిస్తోందని తెలిపారు.

మామునూర్‌కు మండల హోదా కల్పిస్తే స్థానిక ప్రజలకు రెవెన్యూ, వ్యవసాయం, సంక్షేమం, విద్య, ఆరోగ్య సేవలు మరింత వేగంగా అందుబాటులోకి వస్తాయని చెప్పారు. జనాభా, భౌగోళిక విస్తీర్ణం, అభివృద్ధి అవసరాలు, పరిపాలనా సౌలభ్యం వంటి అన్ని అంశాలను పరిశీలించినా మామునూర్ మండల ఏర్పాటుకు పూర్తి అర్హత కలిగి ఉందని పేర్కొన్నారు. ప్రజల భావోద్వేగాలను, వారి దీర్ఘకాలిక ఆకాంక్షలను ప్రభుత్వం మరింత ఆలస్యం చేయకుండా గుర్తించాలని కోరిన ఆయన, ఉద్యమకారుల సహనాన్ని పరీక్షించకుండా తక్షణమే మామునూర్ మండలాన్ని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "మామునూర్ మండల సాధన కోసం ప్రజలు చేస్తున్న ఉద్యమం ప్రజాస్వామ్యబద్ధమైన హక్కుల పోరాటం. ఈ పోరాటానికి తెలంగాణ రక్షణ సేన పూర్తి అండగా ఉంటుంది. ప్రజల లక్ష్యం నెరవేరే వరకు ఉద్యమకారులతో కలిసి నడుస్తాం" అని డా. లయన్ నడిపెల్లి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. మండల సాధన కోసం నిరంతరం పోరాడుతున్న ఉద్యమ నాయకులు, యువత, ప్రజాప్రతినిధుల పట్టుదల అభినందనీయమని పేర్కొన్న ఆయన, మామునూర్ ప్రజల న్యాయమైన డిమాండ్‌కు ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు మల్లేష్, కిషోర్‌తో పాటు పలువురు కార్యకర్తలు, యువ నాయకులు పాల్గొని ఉద్యమానికి తమ సంఘీభావాన్ని ప్రకటించారు.



## ఘనంగా జిల్లా కౌన్సిల్ సభ్యులు కుమ్మరి సిద్దిరాములు జన్మదిన వేడుకలు

టేక్మాల్, జూన్ 16 (వాయిస్ టుడే ప్రతినిధి) : మెదక్ జిల్లా కౌన్సిల్ సభ్యులు కుమ్మరి సిద్దిరాములు జన్మదిన వేడుకలు టేక్మాల్ మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే సిద్దిరాములు ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. సిద్దిరాములు మాట్లాడుతూ, తన జన్మదినాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో మరింత బాధ్యతతో సేవలందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను అభినంధించిన పోలీస్ కమిషనర్



ఖమ్మం, జూన్ 16( వాయిస్ టుడే): చిన్నారులపై లైంగిక వేధింపులు పోక్సో కేసుల్లో, గంజాయి వంటి తీవ్రమైన చీణూా కేసుల్లో బలమైన సాక్ష్యాధారాలు కోర్టుకు సమర్పించడం, ప్రాసిక్యూషన్, పోలీసుల సమన్వయంతో నేరం రుజువు చేయడంలో కీలక పాత్ర పోషిస్తూ... నేరస్థులకు జీవిత ఖైదు, 20 ఏళ్ల జైలు శిక్ష మొదలు అనేక కఠిన కారాగారా శిక్షలు పడేలా కృషి చేసిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్ కుమార్ రెడ్డి ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఏడాదిలో ఇప్పటికే ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదు అయిన ఐదు పోక్సో కేసుల్లో ఖమ్మం అర్బన్ కేసు లో నిందుతుడికి జీవిత ఖైదు, రఘునాథపాలెం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష, ఖమ్మం రూరల్ రెండు వేర్వేరు కేసులో ఏడు, ఐదు సంవత్సరాల జైలు,రఘునాథపాలెం కేసులో మూడు సంవత్సరాల ఆరు నెలల శిక్ష పడ్డాయి. అదేవిదంగా గంజాయి వంటి 10 చీణూా కేసుల్లో ఆరు కేసుల్లో 20 ఏళ్ల కఠిన కారాగారా శిక్ష, మరో రెండు కేసుల్లో 10 ఏళ్ల జైలు, ఒక కేసులో ఏడు ఏళ్ల జైలు, రెండు కేసుల్లో ఏడాది వరకు జైలు శిక్ష పడేలా చేయడంలో కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో పోలీస్ కమిషనర్ అభినందించారు.

## ప్రారంభమైన స్టాప్ డయేరియా క్యాంపెయిన్



ఖమ్మం , జూన్ 16 ( వాయిస్ టుడే ): ఖమ్మంలో నిర్వహించిన ఆశ నోడల్ ఆఫీసర్ల సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రామారావు పాల్గొని నోడల్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా డా. రామారావు మాట్లాడుతూ, ఈరోజు నుండి ప్రారంభమైన స్టాప్ డయేరియా క్యాంపెయిన్ -- 2026 కార్యక్రమంలో ఆశా కార్యకర్తలందరూ చురుకుగా పాల్గొని గ్రామాలు, వార్డుల్లో ప్రజలకు పారిశుద్ధ్యం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, ~ా ద్రావణం వినియోగం, జింక్ మాత్రల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు.

అలాగే ఈ నెల 28, 29, 30 తేదీలలో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతానికి ఆశా కార్యకర్తలు ఆరోగ్య సిబ్బందితో సమన్వయంగా పనిచేసి, 0--5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా జూలై 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా అమలు చేసి, లక్షిత పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

అనంతరం డా. రామారావు ఖమ్మం పట్టణంలోని శ్రీనివాస్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను సందర్శించారు. కేంద్రంలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై సమీక్ష నిర్వహించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన సూచనలు చేశారు.అదేవిధంగా స్టాప్ డయేరియా క్యాంపెయిన్, పల్స్ పోలియో కార్యక్రమం మరియు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి సంబంధిత సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని ఆయన ఆదేశించారు.




## జూన్ 20న జాతీయ లోక్ ఆదాలత్

ఖమ్మం, జూన్ 16 (వాయిస్ టుడే ): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ శ్రీమతి పి.దేవి మానస బ్యాంకర్లు చిట్ఫండ్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జి రాజగోపాల్ మాట్లాడుతూ జూన్ 20న జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహించనున్నట్లు రాజీ చేసుకోవాలనుకునే వారు దీన్ని సద్వినియోగం చేసుకొని కోర్టు కేసుల నుంచి ఉపశమనం పొందాలని సూచించారు అదేవిధంగా రాబోయే జాతీయ లోకా ఆదాలత్ ను అందరూ ఉపయోగించుకోవాలని ఎక్కువ సంఖ్యల రాజీ పడాలని" రాజియే రాజ మార్గమని" అన్నారు. లోక్ ఆదాలత్‌లో రాజీ పరుచుకునే వారు అప్పిలు అనగా పై కోర్టులకు వెళ్లే అవసరం ఉండదని అన్నారు. ఖమ్మం కోర్టులో 2,733 చీ× ~ాష్ కేసులు మరియు 1118 ఇన్సూరెన్స్ కేసులు పెండింగ్ లో ఉన్నాయని వీటన్నింటిని రాజీపరిచేలా పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో బార్ ప్రెసిడెంట్ వై. రమేష్ బార్ కౌన్సిల్ మెంబర్ ఎమ్. శ్రీనివాస్ మరియు ఇతర చిట్ఫండ్ కంపెనీలు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## మిట్టగూడెం పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం

ముదిగొండ, జూన్ 16 (వాయిస్ టుడే) : ముదిగొండ మండల పరిధిలోని మిట్టగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (వీరాూ)లో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని పాఠశాలలో చేరిన చిన్నారులకు గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రముఖుల సమక్షంలో సాంప్రదాయబద్ధంగా ఓనమాలు దిద్దించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ ఉపేందర్, ఉపసర్పంచ్, పాఠశాల చైర్మన్, వార్డు సభ్యులు సతీష్ హాజరయ్యారు. చిన్నారుల చేత అక్షరాలు రాయించి, వారి విద్యాభ్యాసానికి శుభారంభం పలికారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉపేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులందరూ తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు నరేష్, సాయికుమార్ బుర్ర, అలకుంట ఉపేందర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## ముదిగొండ AEO మౌనికకు ఘన వీడ్కోలు

### నూతన AEO వాసంతికి సాదర స్వాగతం

ముదిగొండ మండలం జూన్ 16 వాయిస్ టుడే : ముదిగొండ మండల వ్యవసాయ విస్తరణ అధికారి (ూజుూ) మౌనిక బదిలీ అయిన సందర్భంగా స్థానిక రైతులు ఆమెను ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రైతులు ఆమెకు శాలువా కప్పి, బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ... మౌనిక తమ పదవీ కాలంలో రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ పథకాలను అందిస్తూ ఎంతో ప్రతిభావంతంగా సేవలందించారని కొనియాడారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం, ముదిగొండ మండలానికి కొత్తగా బదిలీపై వచ్చిన నూతన ూజుూ వాసంతికి రైతులు, తోటి సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతన ూజుూ వాసంతి మాట్లాడుతూ... రైతులందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, వ్యవసాయ రంగంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ రాయితీలు సకాలంలో అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ పరిసర ప్రాంతాల రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెంచాలి జిల్లా కలెక్టర్



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్16: నిర్మల్ జిల్లా నేషనల్ మిషన్ ఎడిబుల్ ఆయిల్స్ పథకం కింద 3000 ఎకరాల లక్ష్యంతో జిల్లాల్లో ఆయిల్ ఫామ్ సాగును పెంచాలని కలెక్టర్ భావేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా ప్రతి ఏ ఈ ఓ తమ పరిధిలో 4 ఎకరాల సాగుకు రైతులను గుర్తించాలన్నారు ఈ పంటకు తక్కువ పెట్టుబడి ఎరువులు కూలీల అవసరం ఉంటుందని చీడ పీడల ముప్పు తక్కువగా ఉండి అధిక లాభాలు వస్తాయని వివరించారు ప్రభుత్వం నుండి ఆర్థిక సాంకేతిక సహాయం అందుతుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భావిష్మిశ్ర ఆయిల్ ఫామ్ కంపెనీ యజమానులు వివిధ అధికారులు పాల్గొన్నారు.



## నిర్మల్ మెరుగైన విద్యుత్ సేవలకు సీఎం డి ఆదేశాలు

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 16: నిర్మల్ జిల్లా టీజీ ఎం పి డి సి ఎల్ సిఎండి వరుణ్ రెడ్డి నిర్మల్ అధికారులతో సమీక్షించారు. టిప్పింగులు తగ్గించి విద్యుత్ నెట్వర్కులను బలోపేతం చేయాలని వినియోదారులకు అంతరాయం లేని నాణ్యమైన సరఫరా అందించాలని ఆదేశించారు. అలాగే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను నమోదైన తేదీ నుండి రెండు నెలల లోపు సకాలంలో విడుదల చేయాలన్నారు క్షేత్రస్థాయి సిబ్బంది విధుల్లో భద్రత పరికరాలు వాడాలని సూచించారు ఈ కార్యక్రమంలో టీజీ ఎన్ పి డి సి ఎల్ అధికారులు సీఎం డి వరుణ్ రెడ్డి ఎలక్ట్రిషన్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.





# ప్రతి గ్రామం - ప్రతి పౌరుడు నేర నివారణలో భాగస్వామి కావాలి

### కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్

### సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, మాదకద్రవ్యాలపై గ్రామస్థులకు అవగాహన

### గంజాయి, గుడుంబా వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

### జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 16: నిర్మల్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో నర్సాపూర్ (జి) మండలం కుస్లీ గ్రామంలో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనుమతులు లేకుండా నడుపుతున్న 43 ద్విచక్ర వాహనాలను, 8 ఆటోలను స్వాధీనం చేసుకొని, సంబంధిత నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడమైనది. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడిన ఎస్పీ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, సందేశాలు, సోషల్ మీడియా లింకులు, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద సంఘటనలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

అలాగే ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా యువత గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గుడుంబా, తెల్లకల్లు వంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాలు కుటుంబాలు, సమాజాన్ని నాశనం చేస్తాయని తెలిపారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, ప్రతి పౌరుడు నేర నివారణలో భాగస్వామి కావాలని జిల్లా ఎస్పీ తెలిపారు. నిర్మల్ జిల్లా ఏర్పడ్డాక మొట్ట మొదటి సారిగా ఒక ఎస్పీ, తమ గ్రామానికి వచ్చినందుకు కుస్లీ వాసులు చాలా ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ తో పాటు, నిర్మల్ రూరల్ ఇన్స్పెక్టర్ కృష్ణ, ఎస్ఐ లు గణేష్, శ్రీకాంత్, రవీందర్, లింబాద్రి, పోలీసు, సిబ్బంది, సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.



## రవీంద్రభారతిలో ఘనంగా బీసీ ముస్లిం సర్పంచ్‌ల సత్కారం

### న్యూ లక్ష్మీపురం సర్పంచ్ ప్రతినిధి సమీర్ అహ్మద్‌కు సన్మానం

ముదిగొండ మండలం జూన్ 16 (వాయిస్ టుడే) :బీసీ టైమ్స్ మరియు బీసీ సమాజ్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన బీసీ ముస్లిం సర్పంచ్‌ల ఆత్మీయ అభినందన సత్కార కార్యక్రమం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా, ఉమ్మడి జిల్లా పరిధిలోని న్యూ లక్ష్మీపురం గ్రామ భారత రాష్ట్ర సమితి సర్పంచ్ సలీమా ఖాసీం బాబు సాధించిన విజయానికి గుర్తింపుగా వారిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ సలీమా ఖాసీం బాబు తరపున వారి కుమారుడు, యువ నాయకులు సమీర్ అహ్మద్ ఈ వేదికపై నిర్వాహకుల నుంచి శాలువా, జ్ఞాపికతో సన్మానాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత సమీర్ అహ్మద్ మాట్లాడుతూ... బీసీ ముస్లిం సామాజిక వర్గాల నుంచి ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారిని గుర్తించి, ఇలాంటి పెద్ద వేదికపై గౌరవించడం అభినందనీయమని కొనియాడారు. న్యూ లక్ష్మీపురం గ్రామ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సర్పంచ్ సలీమా ఖాసీం బాబు నాయకత్వంలో నిరంతరం కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. తమ సేవలను గుర్తించి సత్కరించినందుకు బీసీ టైమ్స్ మరియు బీసీ సమాజ్ ప్రతినిధులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అభినందన సభలో రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన పలువురు ప్రముఖులు, బీసీ సంఘాల నాయకులు, మేధావులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సన్మానం అందుకున్న సమీర్ అహ్మద్‌కు న్యూ లక్ష్మీపురం గ్రామ ప్రజలు, అభిమానులు మరియు స్థానిక నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.




## ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

### డి ఈ వోకు ఏబీవీపీ వినతి పత్రం

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్16: నిర్మల్ జిల్లాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు మంగళవారం డీఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జిల్లా కన్వీనర్ దినేష్ మాట్లాడుతూ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు నోట్ బుక్కులు విక్రయిస్తూ విద్యార్థుల తల్లి ఆర్థిక భారం మోపుతున్నారని ఆరోపించారు. నిబంధనలు అధికమిస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ దినేష్ ఏబీవీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు బైంసాలో ఎస్పీ ఫిర్యాదుల విభాగం



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్16: నిర్మల్ జిల్లా బైంసాలోని పోలీస్ క్యాంప్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల విభాగం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. బైంసా డివిజన్లోని ప్రజలు ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తామ స్వీకరిస్తామని. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ జానకి షర్మిల సూచించారు

## ఖానాపూర్ లో ఘనంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జన్మదిన వేడుకలు

### ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్16 : ఖానాపూర్ మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో,చాయ్ వాల మహేష్ అధ్వర్యంలో,కౌన్సిలర్ రాజుర సత్యం,నిమ్మల రమేష్ మండల అధ్యక్షులు అధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నిర్మల్ డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ,ముందుగా కేక్ కట్ చేసి నాయకులతో పుట్టినరోజు జరుపుకున్నారు. రాజుర సత్యం ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ చేశారు, చాయ్ వాల మహేష్ తరుపున విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు, అనంతరం కౌన్సిలర్ విమల రమేష్ నూతన కార్యాలయం ప్రారంభించారు మరియు కౌన్సిలర్లు నాయకులు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులు కార్యకర్తలతో కలిసి జన్మదిన వేడుకలు నిర్వహించుకున్నారు. పేదలకు రైన్ కోట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు,పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు ,కాంగ్రెస్ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఫిట్ నెస్ లేని స్కూల్ బస్సులు సీజ్



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 16: నిర్మల్ జిల్లాలో రవాణా శాఖ అధికారులు ప్రైవేట్ స్కూల్ కాలేజీ బస్సుల తనిఖీలను ముమ్మరం చేశారు. జిల్లా కేంద్రంలో పాటు బైంసా ఖానాపూర్ పట్టణంలో ఎం వి ఐ తిరుపతి ఏ ఎం వి ఐ లు రజినీకాంత్ ఆఫీస్ చేపట్టిన తనిఖీల్లో ఫిట్ నెస్ లేని బస్సులు సీజ్ చేశారు. విద్యార్థులను తీసుకువెళ్లే ప్రతి వాహనానికి రవాణా శాఖ నుండి కచ్చితంగా ఫిట్ నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలని నిబంధనలు తొలగిస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో తిరుపతి రజనీకాంత్ ఆసిఫ్ రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# నారాయణపూర్ 9వ వార్డులో మెడికవర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం



సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా జూన్-16 వాయిస్ టుడే : గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మండలంలోని నారాయణపూర్ గ్రామం అంబేద్కర్ కాలనీలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తొమ్మిదవ వార్డు సభ్యుడు కల్లెపెల్లి దేవేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి కాలనీ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు శిబిరానికి తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో సుమారు నూట యాభై ఎనిమిది మందికి పైగా ప్రజలకు వైద్య సేవలు అందించారు. రక్తపోటు బీపీ, మధుమేహం షుగర్, గుండె సంబంధిత వ్యాధులతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. వైద్య నిపుణులు ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరీక్షించి వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రత్యేక సూచనలు అందించడంతో పాటు అవసరమైన చికిత్సా విధానాలపై అవగాహన కల్పించారు.

వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చిన రోగులను పరీక్షించిన వైద్యులు వారి ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా తగిన వైద్య సలహాలు అందించారు. మందులు కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత లేని పేద కుటుంబాలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి హాజరైన వృద్ధులు, మహిళలు, యువకులు ఈ సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, టైఫాయిడ్ వంటి వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగునీటిని మరిగించి ఉపయోగించడం, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని వివరించారు. అలాగే రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా మెరుగైన చికిత్స అందించడంతో పాటు ఆరోగ్య సమస్యలను అదుపులో ఉంటాయని తెలిపారు. ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ ఏడాదికి కనీసం ఒకసారి పూర్తి స్థాయి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో మెడికవర్ హాస్పిటల్ తరచూ ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత చేరువగా వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ శివకుమార్, సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మేనేజర్ కోట కరుణాకర్, మార్కెటింగ్ ప్రతినిధులు శ్రీకాంత్, సంజీవ్, ఆస్పత్రి సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. శిబిరం విజయవంతానికి సహకరించిన మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యానికి కాలనీ ప్రజలు, తొమ్మిదవ వార్డు సభ్యుడు కల్లెపెల్లి దేవేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..




## బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శికి ఘనంగా సన్మానం

ఝరాసంగం, జూన్16 (వాయిస్ టుడే) : ఝరాసంగం మండలంలోని కక్కర్వాడ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఆనందం బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ... గత ఏడేళ్లుగా కక్కర్వాడ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన ఆనందం, గ్రామంలోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి గ్రామ పెద్దలతో కలిసి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన ఈ గ్రామం నుంచి బదిలీపై వెళ్లడం బాధాకరమైన విషయమే అయినప్పటికీ, ఉద్యోగరీత్యా బదిలీలు సహజమని పేర్కొన్నారు. ఆనందం ఎక్కడ విధులు నిర్వహించినా తన పనితీరుతో మంచి పేరు తెచ్చుకుని, ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఇదే సమయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శికి గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు. బదిలీపై వెళ్తున్న కార్యదర్శి ఆనందంకు వీడ్కోలు పలుకుతూ, నూతన కార్యదర్శికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్రీకాంత్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భాస్కర్, నర్సింలు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ శశికాంత్, ఎస్‌హెచ్‌జీ (రాం+) మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## బార్ కౌన్సిల్ సభ్యురాలు శైలజ కు సన్మానం

సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా జూన్-16 వాయిస్ టుడే : తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యురాలు, గోదావరిఖని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయవాది సిహెచ్. శైలజను సోమవారం సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వొడ్నాల రవీందర్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి ఏకైక న్యాయవాదిగా సిహెచ్. శైలజ గెలుపొందడం పట్ల బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి శైలజ కృషి చేయాలని అమెను కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆవుల శివకృష్ణ, న్యాయవాదులు దివాకర్ రావు, శ్రీనివాసరావు, శ్రీరాములు, తిరుపతి రెడ్డి, భూమయ్య, రమేష్, అజయ్, శ్యామ్ సుందర్, వెంకటేష్, పృథ్వీ, స్నేహ , రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కల్వకుంట్ల కవితకు కాగజ్‌నగర్‌లో ఘనస్వాగతం

కాగజ్‌నగర్: సిర్పూర్ నియోజకవర్గంలోని తుమ్మిడిహట్టి ప్రాణహిత పర్యటనలో భాగంగా టీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాగజ్‌నగర్ పట్టణానికి చేరుకున్నారు. ఆమెకు పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కావేటి సబిత, పార్టీ కార్యకర్తలు చెక్ పోస్ట్ వద్ద ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కవిత తుమ్మిడిహట్టికి బయలుదేరారు.

## రక్తదానం మానవత్వానికి అత్యున్నత సేవ

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**హనుమకొండ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం**



హనుమకొండ, (వాయిస్ టుడే) : ఒక్కసారి చేసే రక్తదానం ద్వారా ముగ్గురు వ్యక్తుల ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని,రక్తదానం మానవత్వానికి అత్యున్నత సేవ అని జిల్లా కలెక్టర్,రెడ్ క్రాస్ జిల్లా శాఖ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని మంగళవారం రెడ్ క్రాస్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ హాజరై తలసేమియా సెంటర్‌ను సందర్శించి చిన్నారులతో ముచ్చటించి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రక్తగ్రూపుల ఆవిష్కర్త కార్ల్ ల్యాండ్‌స్టీనర్ చిత్రపటానికి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వచ్ఛంద రక్తదాతలు,రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్న సంస్థలను అభినందిస్తూ ప్రపంచ రక్తదాతల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కుడా చైర్మన్,హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాం రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా రక్తదాన శిబిరాలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా క్రెడాయ్ జిల్లా అధ్యక్షుడు నాయిని అమరేందర్ రెడ్డి రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలకు రూ.2 లక్షల విరాళాన్ని ప్రకటించారు. అనంతరం రక్తదాన శిబిరాలను నిర్వహించిన నిర్వాహకులు,అత్యుత్తమ రక్తదాతలను జిల్లా కలెక్టర్,రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు ప్రశంసాపత్రాలు,షీల్డ్‌లు,శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా శాఖ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి,వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, మరాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు,డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.డి రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## హరిపిరాలో ఘనంగా బడిబాట కార్యక్రమం

తొర్రూరు, జూన్ 16 (వాయిస్ టుడే) : తొర్రూరు మండలం హరిపిరాల గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ర్యాలీ మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పాఠశాలనుండి మొదలై గద్దల కాలనీ, తలారికాలనీ మీదుగా ఊరంతా తిరిగి గ్రామపంచాయతీ దగ్గర సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య హాజరై ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరడం వలన వారికి కలిగే ప్రయోజనాలను, వివరించి ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఎంపీపీఎస్ హరిపిరాలలో నూతనంగా ప్రీ ప్రైమరీ మొదలైందని ఇందులో నర్సరీ నుండి ఎల్కేజీ, యూకేజీ వరకు విద్యార్థులను చేర్పించాలని అదేవిధంగా ప్రీ ప్రైమరీ కి ఒక ఇన్స్ట్రక్టర్ , ఒక ఆయా శాంక్షన్ అయ్యారని తెలిపారు. సర్పంచ్ సిహెచ్ స్వాతి రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విలువలతో కూడిన నాణ్యమైన విద్యను సుశిక్షితులైన ఉపాధ్యాయులు బోధిస్తారని కావున తల్లిదండ్రులందరూ తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరడం జరిగింది. జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు బీవీ రావు మాట్లాడుతూ ఈ సంవత్సరం నుండి వెనకబడిన విద్యార్థుల కోసం సాయంత్రం ప్రత్యేక తరగతులు తీసుకుంటామని విద్యార్థుల యొక్క సర్వతో ముకాఅభివృద్ధికి తోడ్పడుదామని మన పాఠశాల విద్యార్థి పదవ తరగతిలో టాప్ వచ్చాడని తెలిపారు. ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్ దర్గయ్య మాట్లాడుతూ తమ పాఠశాలలో ఈ సంవత్సరం నర్సరీ, ఎల్కేజీ , యూకేజీ నుండి 5వ తరగతి వరకు విద్యార్థిని చేర్పించినట్లయితే వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తామని కావున మా పాఠశాలలో చేర్పించాలని కోరారు. బడిబాటలో భాగంగా ఎంఈఓ బుచ్చయ్య, సర్పంచ్ సీహెచ్ స్వాతి రాజు , ఉప సర్పంచ్ వెంకన్న, సుధాకరాచారి, జి శ్రీనివాస్, వార్డు సభ్యులు, హై స్కూల్, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బీవీ రావు , సి.హెచ్ దుర్గయ్య రెండు పాఠశాలల ఉపాధ్యాయ బృందం మరియు గ్రామ పెద్దలు, అంగన్వాడీ టీచర్లు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇంత మంచి కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరిని, రెండు పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఎంఈఓ ప్రత్యేకంగా అభినందించారు.



## ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులుగా బైండ్ల విజయ్ కుమార్ నియామకం

వాయిస్ టుడే మహబూబ్నగర్ జిల్లా : జడ్చర్ల /మహబూబ్నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు పశువుల రాజు ఆధ్వర్యంలో ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులుగా మంగళవారం బైండ్ల విజయ కుమార్ నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి యాదయ్య, అంజి, సతీష్ పాల్గొన్నారు



## మైలారం గ్రామంలో శ్రీ ఉమా మహేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక

శాయంపేట (వాయిస్‌టుడే): మండలంలోనీ మైలారం గ్రామంలో కొలువుతీరినటువంటి పురాతన దేవాలయం శ్రీ ఉమా మహేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం గ్రామస్తులు ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీ గౌరవ అధ్యక్షులుగా జూలూరు చంద్రశేఖర్, అధ్యక్షులుగా రంగు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మామిడిపల్లి సాంబయ్య, జోగిరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా దూదిపాల రాంరెడ్డి, నూనె శ్రీనివాస్, కోశాధికారిగా బత్తిని తిరుపతి, సలహాదారుగా సలేంద్ర రవీంద్రా చారి మరియు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఉమా మహేశ్వర స్వామినీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేసి, రాబోయే ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తామని, గ్రామస్తులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు,గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## గ్రామసభ తీర్మానంపై విచారణ గ్రామస్తుల మధ్య నిన్న కొన్న వాగ్దానం

**- గ్రామస్తుల మధ్య నెలకొన్న వాగ్వివాదం**

నర్సాపూర్ (వాయిస్ టుడే): నియోజకవర్గంలో హత్నూర గ్రామ శివారులోని అల్వాయి చెరువు మట్టి తవ్వకాలపై గ్రామ సభలో చేసిన తీర్మానంపై జిల్లా పంచాయతీ అధికారి మల్లారెడ్డి, డి ఎల్ పి ఓ అనిత మంగళవారం విచారణ చేపట్టారు. హత్నూర గ్రామపంచాయతీలో గ్రామసభ నిర్వహించి మట్టి తవ్వకాలపై తీర్మానం చేసి అనుమతుల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా కొందరు వార్డు సభ్యులు గ్రామస్తులు గ్రామసభ నిర్వహించకుండానే అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం అధికారులు పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు.. ముందుగా సర్పంచ్ వార్డు సభ్యులతో విచారణ చేసిన అధికారులు అనంతరం గ్రామస్తుల తో విచారణ చేపడుతున్న క్రమంలో వార్డు సభ్యులు గ్రామస్తులు ఇరు వర్గాలుగా ఏర్పడి వాదోపవాదులకు దిగారు.. గ్రామసభ నిర్వహించి తీర్మానం చేశామని కొందరు గ్రామసభ నిర్వహించకుండానే నిర్వహించినట్లు తప్పుడు పత్రాలు సృష్టించారని మరికొందరు వాదించడంతో ఘర్షణ వాతావరణం నెలకొన్నది.. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ గ్రామసభ నిర్వహించి తీర్మానం చేసినట్లు మెజార్టీ వార్డు సభ్యులు ఒప్పుకున్నట్లు తెలిపారు. గ్రామంలో చేపట్టిన విచారణ నివేదికను జిల్లా కలెక్టర్కు అందజేసి అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకొనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మట్టి తవ్వకాలకు ఇరిగేషన్ అధికారుల అనుమతులు తప్పనిసరని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్ ఎంపీ ఓ యూసుఫ్ పాల్గొన్నారు.




## కుళాయిల ద్వారా స్వచ్ఛమైన నీరు

**ఆర్ డబ్ల్యు ఎస్ డి ఈ ఈ లక్ష్మి**

నర్సాపూర్ (వాయిస్ టుడే): హత్నూర. గ్రామీణ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో కుళాయిల ద్వారా అందించే స్వచ్ఛమైన నీటిని తాగాలని ఆర్డబ్ల్యూఎస్ డి ఈ ఈ లక్ష్మి అన్నారు. మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ గ్రామంలో హర్ ఘర్ జల్ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన నీటిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డి ఈ ఈ లక్ష్మీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఇంటికి కులాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తుందని తెలిపారు. ఇతర కంపెనీల పేరుతో వచ్చే నీటి కంటే కుళాయిల ద్వారా సరఫరా చేసే మీరే స్వచ్ఛమైనదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్ గౌడ్ స్థానిక సర్పంచ్ శ్రీహరి, ఉప సర్పంచ్ గునుకుంట్ల శంకర్, గ్రామ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, వార్డు సభ్యులు జగన్ యాదవ్, సేరి సంతోష బాబు, మన్నే అశోక్ ,ఖైరతా తదితరులు పాల్గొన్నారు

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
బుధవారం 17 జూన్ 2026

# వర్షాకాలం నాటికి 90 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం

**శంకుస్థాపనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ**

**ప్రభుత్వ భూముల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం**

**వైఎస్సార్ నగర్ అంశంపై జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ నిర్వహిస్తోంది**

**బిజెపి నాయకులు ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలి**

**పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని**

**61వ డివిజన్‌లో కోటి రూపాయల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన**



హనుమకొండ, (వాయిస్ టుడే) : కాజీపేట 61వ డివిజన్‌లోని వెంకటాద్రి నగర్ మరియు ప్రశాంత్ నగర్ లలో కోటి రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నాటికి డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో 90 శాతం పూర్తిచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. శంకుస్థాపనలు చేయడం,ప్రారంభోత్సవాలు నిర్వహించడం వరకే తమ బాధ్యత కాదని..నిర్ణీత గడువులో పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి పనికి కాలపరిమితి నిర్ణయించి,క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. కాజీపేట అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్న ఆయన గత ప్రభుత్వాల మాదిరిగా హామీలకే పరిమితం కాకుండా పనులు చేసి చూపిస్తున్నామని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాజీపేట రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులను వేగవంతం చేశామని,త్వరలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా కాజీపేట బస్‌స్టాండ్ నిర్మాణం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరుపుతున్నామని తెలిపారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.

బిజెపి నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలి

గడిచిన రెండున్నర సంవత్సరాలుగా నగరంలో ఎటువంటి భూ కబ్జాలు జరగకుండా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు అన్ని ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్,బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇటీవల హంటర్ రోడ్ లో కొందరు వ్యక్తులు చేసిన ఉదాంతం ప్రజలు గమనించారని తెలిపారు. వైఎస్సార్ నగర్ సంబంధిత అంశంపై జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ నిర్వహిస్తోందని చెప్పారు. ప్రైవేట్ భూములకు సంబంధించి కోర్టు తీర్పే అంతిమమని..ప్రభుత్వం న్యాయపరమైన నిర్ణయాలను గౌరవిస్తుందని పేర్కొన్నారు. భూమి ప్రభుత్వ స్థలమని తేలితే ఒక్క గజం కూడా ఆక్రమణకు గురికాకుండా కాపాడుతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అవసరమైతే ఆ స్థలంలో బస్‌స్టాండ్,పోలీస్ స్టేషన్ లేదా ఇతర ప్రజాప్రయోజన కార్యక్రమాలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. గతంలో జరిగిన భూ ఆక్రమణలపై స్పందించని ప్రతిపక్ష పార్టీలు ఇప్పుడు రాజకీయ విమర్శలు చేయడం సమంజసం కాదని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజల ఆస్తులు,ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో తమ ప్రభుత్వం రాజీ పడదని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై బిజెపి నాయకులు చేస్తున్న ఆరోపణలు ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు గత ప్రభుత్వ హయాంలో ఆనాటి పాలకులు తమ సొంత పార్టీ కార్యాలయాల కోసం ప్రభుత్వ విలువైన భూములను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టినప్పుడు ఈ బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడలేదని ఎమ్మెల్యే నాయిని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సాగరిక రమాకాంత్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు గాజపాక రమేష్,స్థానిక నాయకులు,అధికారులు రాజ్ కుమార్,హరికుమార్ స్థానిక కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు, జూన్ 16 వాయిస్ టుడే : తొర్రూరు మున్సిపాలిటీలోని కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని, వారికి ఇవ్వాల్సిన సబ్బులు, కొబ్బరి నూనె, డ్రెస్సులు వెంటనే అందించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు.తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తొర్రూర్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కార్మికులకు గత ఆరు నెలలుగా కార్మికులకు అందాల్సిన సబ్బులు,కొబ్బరినూనెలను వెంటనే అందించాలని అన్నారు.గత సంవత్సర కాలంగా బట్టలు కార్మికులకు ఇవ్వలేదని వాటిని వెంటనే ఇచ్చే ఏర్పాటు చేయాలని కోరారు. పిఎఫ్,ఈఎస్ఐ బకాయి లేకుండా ప్రతినెల చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.జీవో నెంబర్ 60 ని సవరించి కార్మికులకు కనీస వేతనం అందించాలని ప్రస్తుతం దేశంలో ధరలు పెరిగి ఆకాశాన్ని అంటుతుంటే వేతనాలు మాత్రం పెరగకపోతే కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. నిత్యవసర సరుకులు ధరలు పెట్రోల్,డీజిల్,వంట గ్యాస్ ధరలు ఇతర వినియోగ వస్తువుల ధరలు భారీగా పెరిగాయని అన్నారు.ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని వేతనాలు పెంచాలని ఆయన అన్నారు. స్పందించిన కమిషనర్ ఉన్నత అధికారులు,పాలకమండలితో మాట్లాడి వీలైనంత తొందరలో ఈ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వేల్పుల మహేందర్ , తొర్రూర్ మున్సిపల్ అధ్యక్షుడు మంగళపల్లి గురుకు యాకయ్య, ఉపాధ్యక్షులు మాచర్ల మురళి, టియుసిఐ తొర్రూర్ ఏరియా కమిటీ అధ్యక్షులు ఎండి షరీఫ్, మహేష్, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



## తొర్రూరు సొసైటీని సందర్శించిన కర్నూలు బృందం

తొర్రూరు , జూన్ 16 వాయిస్ టుడే : తొర్రూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లాకు చెందిన పలువురు అధికారుల బృందం మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా తొర్రూరు పిఏసిఎస్ చైర్మన్ కాకిరాల హరి ప్రసాద్ రావు అధ్యక్షతన సొసైటీ అభివృద్ధి పైన ప్రజెంటేషన్ ఇచ్చారు. కర్నూలు జిల్లా డిసిసి బ్యాంక్ సీఈవో రామాంజనేయులు, డీజీఎం ఉమామహేశ్వర్ రెడ్డి, డిపిఎం రంగనాథ్, మామిండ్లపాడు పిఏసిఎస్ చైర్మన్ సూర్య ప్రకాష్ రెడ్డి, పసుపల్ల పిఏసిహెచ్ చైర్మన్ వెంకట్రాములు, వెల్దుర్తి పిఏసిఎస్ చైర్మన్ రమాకాంత్ రెడ్డి,నందికొట్కూర్ పిఏసిఎస్ చైర్మన్ ముత్రాజ్ వలి,సీఎం ఆపరేషన్ సెక్షన్ అధికారి రాఘవేంద్ర, సీఎం పి డి సి సెక్షన్ ప్రతినిధి ఇందిరా ప్రియదర్శిని,ఎల్టి సెక్షన్ అధికారి పద్మావతి, ఏఎంపీడీసీ సెక్షన్ అధికారి ఎండి ముష్రత్,ఏఎం ఓఆర్ సెక్షన్ అధికారి కరిష్మా, ఏసిఎపిడిసి సెక్షన్ అధికారి మమత, సీఎం కోయిల కుంట్లబ్రాంచ్ మేనేజర్ అమర్నాథ్ రెడ్డి,విష్ణు నగర్ బ్రాంచ్ మేనేజర్ ఎం. రమాదేవి, కోడుమూరు బ్రాంచ్ మేనేజర్ అయ్య స్వామి,ముత్యాల పిఏసిహెచ్ సీఈవో హరినాథ్ రెడ్డి, చాగలమర్రి పిఏసిఎస్ సీఈవో ఉపేంద్ర కుమార్ రెడ్డి, భానుమకుల పిఏసిఎస్ సీఈవో ఎండి షమీర్, ఆత్మకూర్ పిఏసిఎస్ సిఓ ప్రసన్నకుమార్ల బృందం మంగళవారం నాడు స్టడీ టూర్ లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో స్వల్ప కాలంలోనే గొప్ప అభివృద్ధిని సాధించిన సొసైటీగా గుర్తింపు పొందిన తొర్రూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించి సంఘం అభివృద్ధికి గల కారణాలను ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. సొసైటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచిన పాలకవర్గాన్ని అభినందిస్తూ చైర్మన్ కాకినాడ హరిప్రసాదరావు ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఈఓ శ్రీనివాస్,సంతోష్ యాకయ్య,నవీన్ ఉపేందర్,సిబ్బంది పాల్గొన్నారు.



## నమ్మకం,అభివృద్ధి,సంక్షేమం మోదీ 12 ఏళ్ల సుపరిపాలన

**వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 'స్వచ్ఛ భారత్' కార్యక్రమం**

**మోదీ అద్భుత పాలనకు సంఘీభావంగా మరిన్ని సేవా కార్యక్రమాలు**

**బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మ రెడ్డి**

హనుమకొండ: నమ్మకం,అభివృద్ధి,సంక్షేమమే ధ్యేయంగా దేశంలో మోదీ 12 ఏళ్ల సుపరిపాలన సాగిందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మ రెడ్డి తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాటు (4,399 రోజులు) దేశ ప్రధానిగా దేశ ప్రజలకు నిరంతర సేవలందిస్తూ,సరికొత్త చరిత్ర లిఖించిన శుభసందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో సేవా కార్యక్రమాల నిర్వహణలో భాగంగా నియోజకవర్గంలోని 4వ డివిజన్ బాసిత్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో "స్వచ్ఛ భారత్" కార్యక్రమాన్ని జిల్లా కౌన్సిల్ సభ్యులు గొర్రె ఓం ప్రకాశ్ మరియు డివిజన్ అధ్యక్షులు బాల్నే రేవంత్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశాన్ని ప్రపంచ అగ్రగామిగా నిలిపేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. ఆయన స్ఫూర్తితోనే నేడు పాఠశాల పరిసరాలను శుభ్రం చేసి 'స్వచ్ఛతే సేవ' అనే గొప్ప సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం జరిగిందని పేర్కొన్నారు. మోదీ అద్భుత పాలనకు సంఘీభావంగా రాబోయే రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి కేతిపల్లి సంపత్ రెడ్డి,9వ డివిజన్ అధ్యక్షులు కస్తూరి నవీన్ స్థానిక డివిజన్ బీజేపీ నాయకులు ఏడుకొండలు, వాణి, మహేందర్, కార్యకర్తలు,తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## కాజీపేట చౌరస్తాలో అభివృద్ధిపై చర్చకు సిద్ధం

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి రావు పద్మ రెడ్డి సవాల్**

కాజీపేట, (వాయిస్ టుడే) : కాజీపేట చౌరస్తాలో అభివృద్ధిపై బహిరంగ చర్చకు బీజేపీ సిద్ధంగా ఉందని.. తేదీ,సమయాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డే నిర్ణయించాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం సాయంత్రం కాజీపేట చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన "చాయ్ పే చర్చ" కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలపై రావు పద్మ రెడ్డి ప్రజలకు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మ రెడ్డి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బీజేపీ,కేంద్ర ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కేంద్ర ప్రభుత్వం కాజీపేట అభివృద్ధికి చేసిన కృషిని నిరూపిస్తామని,కాంగ్రెస్ నాయకులు తమ అభివృద్ధి గురించి ప్రజలకు వివరించే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. కాజీపేట రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు రూ.25 కోట్లు,నూతన రైల్వే ఆస్పత్రి నిర్మాణం,రూ.720 కోట్ల వ్యయంతో రైల్వే కోచ్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ పనులు జరుగుతున్నాయని ఆమె తెలిపారు. మోడీ ప్రభుత్వం పారదర్శక పాలనతో దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ పటేల్,తోపుచెర్ల అర్చన మధుసూదన్ రావు,భగవాన్ ఉపాధ్యాయ,కాయిత రాజ్ కుమార్,కొల్లూరి ఆదిత్య సాయి,డివిజన్ అధ్యక్షులు మేకల శ్రావణ్ కుమార్,రేణుకుంట్ల కల్యాణ్,గందసిరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలి

**అధికారులకు పలు సూచనలు చేసిన కలెక్టర్లు,కుడా ఛైర్మన్**

హనుమకొండ, (వాయిస్ టుడే) : వరంగల్ నగర పరిధిలోని చారిత్రక,పర్యాటక ప్రాధాన్యం కలిగిన ఉర్సుగుట్ట ప్రాంతాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్,వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా,కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి,చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (సీపీవో) అజిత్ రెడ్డి సంబంధిత శాఖల ఉన్నతాధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఉర్సుగుట్ట పరిసర ప్రాంతాల్లో కుడా ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. పర్యాటకులను ఆకర్షించేలా చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి,పర్యావరణ పరిరక్షణ చర్యలు,సందర్శకులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. అనంతరం ఖిలా వరంగల్లు ప్రాంతంలో కొనసాగుతున్న మోటు రిజునవేషన్ అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సాగుతున్నాయా అనే విషయాన్ని పరిశీలించారు. అలాగే రంగ సముద్రం చెరువులో చేపడుతున్న పూడికతీత పనుల పురోగతిని సమీక్షించి పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. తదుపరి రంగలీల మైదానంలో కొనసాగుతున్న మైదానం చదును అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమన్వయంతో పనిచేస్తూ వరంగల్ నగరాన్ని పర్యాటక,సాంస్కృతిక,పర్యావరణ పరంగా మరింత అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు కలెక్టర్లు సూచించారు.

## వైఎస్ఆర్ నగర్ గుడిసె వాసులకు బీఆర్ఎస్ అండ

**వైఎస్ఆర్ నగర్‌లో బీఆర్ఎస్ నాయకుల పర్యటన**



కాజీపేట, (వాయిస్ టుడే) : కాజీపేటలోని వైఎస్ఆర్ నగర్ గుడిసె వాసులను మంగళవారం ఉదయం బీఆర్ఎస్ పార్టీ నాయకులు కలిసి వారికి ధైర్యం చెప్పారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని,గుడిసె వాసులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు నార్లగిరి రమేష్,సంచు కృష్ణ,మాజీ కార్పొరేటర్ సంకు నర్సింగ్‌రావు మాట్లాడుతూ స్థానిక మాజీ కార్పొరేటర్ ఆగడాలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆరోపించారు. కొంతమంది ప్రైవేట్ వ్యక్తులతో కలిసి గుడిసెలను ఖాళీ చేయించాలని గుడిసె వాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. వైఎస్ఆర్ నగర్‌లోని భూమి 100 శాతం మిగులు భూమి అని..అలాంటి భూమి ఇప్పుడు ఎలా పట్టా భూమిగా మారిందో అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాదాపు 30 సంవత్సరాలుగా గుడిసె వాసులు అక్కడే నివాసం ఉంటున్నారని,వారి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గుడిసెలను ఖాళీ చేయించే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. పేదల జీవనాధారాన్ని దెబ్బతీసే చర్యలను వెంటనే నిలిపివేసి,గుడిసె వాసులకు న్యాయం చేయాలని కోరారు. ఎలాంటి ఒత్తిళ్లకు భయపడవద్దని,సమస్య పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 62వ డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల శివకుమార్,47వ డివిజన్ అధ్యక్షుడు దువ్వ కంకరాజు,అర్బన్ జిల్లా నాయకుడు ఎం.డీ అఫ్జల్,పాలడుగుల రామస్వామి,తండమల్ల వేణు,కాటాపురం రాజు,నయీం జుబేర్,63వ డివిజన్ అధ్యక్షుడు బెదరకోట రంజిత్ కుమార్,ఎస్.కే. మహ్మూద్,బరిగెల వినయ్,మాచర్ల ప్రభాకర్,నార్లగిరి సమ్మయ్య,వెనిశెట్టి రఘు,తేలు సారంగపాణి,పాము రాజేష్,రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా 16వ వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని జన్మదిన వేడుకలు

**150 పడకల ఆసుపత్రి వద్ద కార్మికుల సమక్షంలో సంబురాలు**

మక్తల్ జూన్ 16 : మక్తల్ మున్సిపాలిటీ 16వ వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని జన్మదిన వేడుకలు నూతనంగా నిర్మిస్తున్న 150 పడకల ఆసుపత్రి వద్ద కార్మికుల సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్మికులు, స్థానిక నేతల మధ్యన కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మక్తల్ సివిల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ అల్కూరి పావని మాట్లాడుతూ.. మంత్రి వాకిటి శ్రీహరి గారు, ఆయన సతీమణి వాకిటి లలిత గారి ఆశీస్సులతో...చిన్న వయసులోనే కౌన్సిలర్ గా తనకు అవకాశం ఇచ్చారని, ఈ సందర్భంగా వారికి జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. కేవలం వంద రోజుల్లోనే లక్షల రూపాయల నిధులు కేటాయించి, వార్డు అభివృద్ధి కి మంత్రి వాకిటి శ్రీహరి గారు ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. రాబోయే రోజుల్లో సైతం మంత్రి వాకిటి శ్రీహరి గారి సహకారంతో వార్డు అభివృద్ధి కి చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాలం, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ అల్కూరి రవికుమార్, నాయకులు కలాల్ నీల గౌడ్, వల్లంపల్లి గురు రాజ్, ప్రవీణ్ కుమార్, ఆనంపల్లి రమేష్ దామరగిద్ద రాము , కడే చూర్ రాజేష్ , అంబాదాస్ రావు, అమ్రేష్ ,మహమ్మద్, అఫ్రోజ్ , మందిపాల్ సతీష్ , నీలి సంతోష్ , రఫ్ ,ప్రవీణ్ కుమార్, నాదర్ , తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**